- ఐదు మండలాలకు పొంచి ఉన్న ముప్పు
- వాకాడులో పునరావాస కేంద్రాలకు తరలింపు
- జిల్లాలో 208 కేంద్రాల ఏర్పాటు



నేడు విద్యాసంస్థలకు సెలవు

భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం తెలిపారు. సంబంధిత యాజమాన్యాలు విధిగా సెలవు పాటించాలన్నారు.

ఒకటే.. వాన




తిరుపతిలో రహదారిపై నిలిచిన నీరు


తూపిలిపాళెం పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న లోతట్టు ప్రాంత ప్రజలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మూడురోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి మోస్తరు పాటి వర్షం నిరంతరంగా కురవగా.. రాత్రి 7 గంటలు దాటాక భారీ వర్షంగా మారింది. పలు మండలాల్లో కరెంటు సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముంపు ప్రాంతాల్లోని ప్రజల కోసం ముందస్తుగా అధికారులు 208 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వాకాడు, చిల్లకూరు, కోట, తడ, గూడూరు, బీఎన్‌కండ్రిగ, డక్కిలి ప్రాంతాల్లో భారీ వర్షపాతం నమోదైంది. ఇక సముద్ర తీర ప్రాంత మండలాలైన చిల్లకూరు, వాకాడు, కోట, తడ, సూళ్లూరుపేటలో భారీ వర్షపాతం నమోదైన నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ యంత్రాంగం సహాయక చర్యలకు సిద్ధమైంది. వాకాడు మండలం తూపిలిపాళెం ఎస్టీకాలనీ వాసులను ప్రభుత్వ పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు. మిగతా మండలాల్లోని ప్రజలను రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం చేస్తూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు వెళ్లాలని విజ్ఞప్తి చేస్తోంది. మరోవైపు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను గూడూరు ఆర్డీవో కార్యాలయానికి తరలించారు. బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూముకు (ఫోను నెంబరు: 0877-2236007)లేదా ఆయా రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లోని కంట్రోల్‌రూమ్‌లకు సమాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు.

వాకాడులో తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఎంపీడీవో అన్నపూర్ణరావు



వానొస్తే ఇంతే

వర్షమొస్తే చాలు.. ఇలా వాగులో శవంతో సాహస యాత్ర చేయాల్సిందే. నాగలాపురం మండలం సురుటుపల్లె పంచాయతీ కసూ్తరినాయుడు కండ్రిగ ప్రజలకు ఏటా ఇదో బాధాకర అనుభవంగా మారుతోంది. తుఫాన్ నేపథ్యంలో అరుణానదికి సంబంధించిన కాలువకు నీళ్లు రావడంతో మంగళవారం శంకర్(53) మృతదేహాన్ని నడుములోతు నీటిలో ఇలా తీసుకెళ్లారు. వంతెన ప్రతిపాదన కార్యరూపం దాలిస్తేకానీ, వీరికి ఈ సమస్య తీరదు మరి.

\- నాగలాపురం, ఆంధ్రజ్యోతి



అవసరమైతే తప్ప ప్రయాణాలు వద్దు

భారీ వర్షాల నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని కలెక్టర్ వెంకటేశ్వర్ విజ్ఞప్తి చేశారు. కాజ్‌వేలు, వంకల్లో నీరు ప్రవహిస్తున్న సమయంలో ప్రయాణం వద్దన్నారు. ప్రాణ.. ఆస్తి నష్టం లేకుండా ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.

జూపార్కులో జంతువులకు ప్రమాదం లేదు

మంగళం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఎస్వీ జూపార్కులోని ఎన్‌క్లోజర్‌లో ఉండే జంతువులకు ఎలాంటి ప్రమాదం లేదని క్యూరేటర్ సెల్వం తెలిపారు. గతంలో భారీ వర్షాలకు ఎన్‌క్లోజర్‌లో వరదనీరు చేరి జంతువులకు ఇబ్బంది కలిగేదని గుర్తుచేశారు. ఆ సమస్య పునరావృతం కాకుండా డ్రైనేజీ వ్యవస్థను పటిష్ఠం చేశామన్నారు. జంతువుల రక్షణకు అన్ని చర్యలు తీసుకోవడంతో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు.

సహాయక చర్యలకు మేము సిద్ధం


తిరుపతి (జీవకోన), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో తక్షణ సహాయక చర్యలకు తాము సిద్ధంగా ఉన్నట్లు జిల్లా రవాణాశాఖ అధికారి మురళీమోహన్ మంగళవారం తెలిపారు. వాకాడు, తూపిలిపాళెం, చిల్లకూరు, నాయుడుపేట వంటి ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేయడంతో పాటు అక్కడ ఎక్స్‌కవేటర్లు, క్రేన్లు, స్కూల్, కళాశాలల బస్సులను అందుబాటులో ఉంచామన్నారు. వరదలు ఎక్కువైతే ఎక్స్‌కవేటర్ల ద్వారా గట్లను తొలగించడం.. క్రేన్ల ద్వారా బోట్లను ఇతర ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేశామన్నారు. వరద ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టడానికి నలుగురు ఎంవీఐలను అందుబాటులో ఉంచామన్నారు.


గూడూరులో స్టేడియంలో నిలిచిన వర్షపునీరు

మళ్లీ తయార్! సిండికేటుగాళ్ళు

జిల్లావ్యాప్తంగా మద్యం దుకాణాల కేటాయింపుల వెనుక సిండికేట్లు కీలక పాత్ర వహిస్తున్నాయి. కొన్ని చోట్ల ముందుగానే గ్రూపులుగా ఏర్పడి దరఖాస్తులు వేయగా.. మరికొన్ని చోట్ల షాపులు ఖరారయ్యాక సిండికేట్లు ఏర్పాటవుతున్నాయి. పలు నియోజకవర్గాల్లో అధికార పార్టీ ముఖ్యనేతలు తెర వెనుక ఉండి మంత్రాంగం నడిపిస్తుండగా తెర ముందు మాత్రం స్థానిక ద్వితీయ శ్రేణి నాయకుల హడావిడి కనిపిస్తోంది. సిండికేట్లతో సంబంధం లేకుండా షాపులు దక్కించుకున్న వారికి బెదిరింపులు, ఒత్తిళ్లు వస్తున్నాయి. నియోజకవర్గాల వారీగా సిండికేట్ల తీరుపై 'ఆంధ్రజ్యోతి' పరిశీలనాత్మక కథనం.

\- తిరుపతి, ఆంధ్రజ్యోతి



పాకాలలో బెదిరింపులు

చంద్రగిరి నియోజకవర్గం.. పాకాల మండలంలో ఐదు షాపులు వుండగా టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 25 మంది గ్రూపుగా ఏర్పడి దరఖాస్తులు వేశారు. వారికి మూడు షాపులు దక్కాయి. మరో రెండు ఇతరులకు ఖరారయ్యాయి.స్థానిక టీడీపీ నేతలు కొందరు ఆ షాపుల యజమానులను బెదిరించి దౌర్జన్యంగా షాపులు లాక్కొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ ఒత్తిళ్లతోనే ఒక దుకాణానికి లైసెన్సు ఫీజు కట్టలేదని తెలుస్తోంది. చంద్రగిరి మండలంలో ఏడు షాపులూ టీడీపీ వారికి దక్కగా.. అందులో ఒకదానిలో వైసీపీ వారూ భాగస్వాములని సమాచారం. టీడీపీకి చెందిన 35 మంది సిండికేట్‌గా ఏర్పడి దరఖాస్తులు చేయగా ఏడింటిలో ఒక షాపే వచ్చిందని సమాచారం.తిరుపతి రూరల్ మండలంలో 12షాపుల్లో ఎక్కువ భాగంగా వైసీపీ వారికి దక్కినట్లు తెలిసింది. అధికార పార్టీకి చెందిన ఓ యువనేత సుమారు 50 దరఖాస్తులు వేయిస్తే ఒక్కటీ రాలేదని చెబుతున్నారు.ఇక్కడా షాపులు తమకే ఇచ్చేయాలని అధికార పార్టీ ద్వితీయ శ్రేణి నేతలు బెదిరింపులకు దిగుతున్నట్లు ఆరోపణలున్నాయి.

వెంకటగిరిలో టీడీపీ- వైసీపీ 'మద్యం దోస్తీ'

వెంకటగిరి మండలంలో మద్యం దుకాణాల కోసం టీడీపీ-వైసీపీ నేతల మధ్య దోస్తీ కుదిరింది. తొమ్మిది షాపుల కోసం మూడు గ్రూపులుగా తయారై.. మూడేసి చొప్పున దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది. ముఖ్యనేతకు షాపుల నుంచీ వాటాతో పాటు ముఖ్య అనుచరులకు భాగస్వామ్యం కల్పించేలా ఒప్పందం ఖరారైనట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. డక్కిలి మండలంలో మూడు షాపులుంటే రెండు వైసీపీ వారికి దక్కినా అందులో టీడీపీ ముఖ్యనాయకులకు వాటా ఉన్నట్లు సమాచారం. మరొకటి టీడీపీ వారికి దక్కింది. బాలాయపల్లి మండలంలో రెండు వైసీపీ.. ఒకటి టీడీపీ వారికి వచ్చిందని సమాచారం. ఈ నియోజకవర్గంలోని షాపులన్నీ సిండికేట్ తరహాలో నడిపేందుకు ఓ పారిశ్రామికవేత్త యత్నిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

గూడూరులో ఎక్కువ అధికార పార్టీ వారికే!

గూడూరు నియోజకవర్గంలో 33 షాపులకుగాను 29 అధికారపార్టీకి చెందిన వారికే వచ్చాయి. రెండు వైసీపీ సానుభూతిపరులకు, ఒకటి తటస్థుడికి వచ్చాయి. మండల స్థాయిలో సిండికేట్లుగా ఏర్పడి దరఖాస్తు చేశారు. ఇక్కడా వెంకటగిరిలో జోక్యం చేసుకుంటున్న పారిశ్రామికవేత్త పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. కోట మండలంలోని ఏడు షాపులూ టీడీపీ వారికే దక్కగా, సిండికేట్ ఏర్పరిచేందుకు ముఖ్యనేత గూడూరుకు పిలిపించి సమావేశం పెట్టారని సమాచారం. వాకాడు మండలంలో నాలుగు షాపులూ టీడీపీ వారికే వచ్చాయి. సిండికేట్‌గా ఏర్పడే దరఖాస్తు చేశారు. ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన ఓ నాయకుడు కూడా ఒక మద్యం షాపులో భాగస్వామిగా వున్నట్టు ప్రచారం జరుగుతోంది. చిట్టమూరు మండలంలో రెండు వైసీపీ వారికి, మిగిలిన రెండు ఇతరులకు దక్కాయి.

సూళ్లూరుపేటలో 'టెన్ పర్సెంట్'

సూళ్లూరుపేట నియోజకవర్గంలో 38 షాపలోట్ల టీడీపీ వారికే అత్యధికం దక్కాయి. వైసీపీ నేతలకు మూడు వచ్చాయి. తటస్తులకు కూడా కొన్ని ఖరారయ్యాయి. సూళ్ళూరుపేట, నాయుడుపేట సర్కిళ్ల పరిధిలో సిండికేట్ల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇక్కడ కూడా వెంకటగిరి, గూడూరు తరహాలోనే ఆ పారిశ్రామికవేత్త పేరు ఎక్కువగా ప్రచారంలో ఉంది. దానికి తోడు ఓ ముఖ్యనేత సోదరుడికి అన్ని షాపుల్లో పది శాతం వాటా చెల్లించేలా ఒత్తిళ్లు వస్తున్నట్టు సమాచారం. కొందరు టీడీపీ నేతలు ముందే గ్రూపుగా ఏర్పడి 30 షాపులకు దరఖాస్తు చేయగా ఒక్కటీ రాలేదు. తడ మండలంలో వైసీపీ వర్గీయులు గ్రూపుగా ఏర్పడి 15 షాపులకు దరఖాస్తు చేసినా ఒక్కటీ దక్కలేదు. నాయుడుపేటలో టీడీపీకి ఏడు, వైసీపీకి ఆరు చొప్పున వచ్చాయి. ఓజిలిలో రెండు షాపులనూ సిండికేట్‌గా ఏర్పడి స్థానిక టీడీపీ నాయకులు తీసుకున్నారని, దొరవారిసత్రం రెండు షాపులూ వైసీపీ వారికి దక్కాయని సమాచారం. నియోజకవర్గంలో ఇరు పార్టీల వారూ ఇప్పుడు కలసిపోయారని, 60 శాతం షాపులు సిండికేట్ నడిపించే పరిస్థితి కనిపిస్తోందని సమాచారం.

నోయిడా వాసులకు సత్యవేడులో మద్యం షాపులు

సత్యవేడు ప్రాంతానికి చెందిన పలువురు మద్యం షాపులకు దరఖాస్తు చేసి రూ.లక్షల్లో చేతి చమురు వదుల్చుకోగా ఎక్కడో ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాకు చెందిన ఇద్దరికి రెండు షాపులు దక్కడం గమనార్హం. సత్యవేడులోని షాపు నంబర్ 98 నోయిడాకు చెందిన సారికా గోయెల్‌కు, షాపు నంబరు 100 వత్సల్ గోయెల్‌కు దక్కాయి. వీరు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించారు. వీరెవరు, ఎవరి తరపున మద్యం షాపులకు దరఖాస్తు చేశారన్నది ఇపుడు చర్చనీయాంశమైంది.

రెండు మద్యం షాపులకు చెల్లించని లైసెన్సు ఫీజు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 227 మద్యం షాపులు దక్కించున్న వారిలో మంగళవారం సాయంత్రం వరకు 225 దుకాణాలకు మాత్రమే లైసెన్సు ఫీజు మొదటి కంతు చెల్లించారు. లైసెన్సులు దక్కించుకున్నారు. పాకాలలో 133వ దుకాణం, తొట్టంబేడులో దుకాణం నెంబరు 75ను దక్కించుకున్న వారు ఇప్పటి వరకు లైసెన్సు చెల్లించలేదు. 'వారికి ఇచ్చిన గడువు ముగిసిపోయింది. దీనిపై ఎక్సైజ్ కమిషనరు సంప్రదించి తదుపరి చర్యలు తీసుకుంటాం. ఆ రెండు దుకాణాలు రిజర్వులో ఉన్న వారికి కేటాయించడానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది' అని ఈఎస్ నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు.

ఇక కొత్త లిక్కర్ షాపులు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం నుంచి కొత్తగా ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం కానున్నాయి. వైసీపీ హయాంలో ఏర్పాటైన ప్రభుత్వ మద్యం దుకాణాలు మంగళవారంతో మూత పడ్డాయి. సోమవారం లాటరీలో షాపులు దక్కించుకున్న వారు బుధవారం ఉదయం 10 గంటల నుంచి మద్యం దుకాణాలను ప్రారంభించుకోవచ్చు. వీటిని ప్రారంభించుకోవడానికి వారం రోజుల పాటు గడువు ఇచ్చారు. ప్రతి రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు షాపులు తెరచి వుంటాయి. కాగా, చాలా చోట్ల ప్రభుత్వ మద్యం దుకాణాలున్న చోటే ప్రైవేటు దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు.

సత్యవేడులో చేతులు కాల్చుకున్న దరఖాస్తుదారులు

వరదయ్యపాళెం మండలానికి చెందిన ఓ టీడీపీ నేత బీఎన్ కండ్రిగ మండల నాయకులతో కలసి 18 షాపులకు దరఖాస్తు చేయగా ఒక్కటీ రాకపోవడంతో రూ.36 లక్షలు నష్టపోయారని ప్రచారం జరుగుతోంది. మరో టీడీపీ నేత ఐదు షాపులకు రెండేసి చొప్పున పది దరఖాస్తులు వేస్తే ఒక్కటీ కూడా రాకపోవడంతో రూ.20 లక్షలు కోల్పోయినట్టు సమాచారం.

శ్రీకాళహస్తిలో సిండికేట్ల జోరు

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మద్యం దుకాణాల సిండికేట్లు జోరు మీదున్నాయి. శ్రీకాళహస్తి మండలంలో 12 షాపులకు ముందుగానే సిండికేట్‌గా ఏర్పడి టీడీపీకి చెందిన వారు షాపులన్నింటినీ దక్కించుకున్నట్లు సమాచారం. తొట్టంబేడు మండలంలోని మూడు.. ఏర్పేడు మండలంలో ఏడు షాపులూ టీడీపీవారికే దక్కాయి. ఏర్పేడులో టీడీపీ ముఖ్యనేత ప్రమేయంతో సిండికేట్‌గా దరఖాస్తుచేసి అన్నింటినీ దక్కించుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. రేణిగుంట మండలంలో ఆరు టీడీపీ,నాలుగు వైసీపీ వారికి వచ్చినట్టు తెలిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా అధికార పార్టీకి చెందిన ముఖ్యనేత జోక్యం చేసుకుని సిండికేట్ ఏర్పాటు చేశారని చెబుతున్నారు.

తిరుపతిలోనూ సిండికేట్లదే హవా

తిరుపతి నగరంలో 32 షాపులకు 900కు పైగా దరఖాస్తులు వచ్చిన సంగతి తెలిసిందే. ఇక్కడ కూడా ముందుగానే కొందరు సిండికేట్‌గా ఏర్పడ్డారు. అధికార పార్టీ కీలక నేత తరపున 30 మంది గ్రూపుగా ఏర్పడి ఏకంగా 350 దరఖాస్తులు వేశారని అయితే లాటరీలో కేవలం ఏడు షాపులు మాత్రమే దక్కాయని సమాచారం. ఆ గ్రూపులో వైసీపీకి చెందిన వారు కూడా వున్నట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే మద్యం వ్యాపారంతో సంబంధం, అనుభవం వున్న వ్యక్తులు కొందరు బృందంగా ఏర్పడి 200 దరఖాస్తులు వేయగా కేవలం నాలుగు దుకాణాలే దక్కినట్టు సమాచారం. మొత్తం 32 షాపుల నిర్వహణనూ ఒకే గొడుగు కిందకు తెచ్చి సిండికేట్ తరహాలో మద్యం వ్యాపారం నడిపేందుకు తెర వెనుక యత్నాలు జోరుగా సాగుతున్నట్టు తెలిసింది.

తీరు బాలేదు తమ్ముళ్లూ!



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ పరిస్థితిపై చంద్రబాబు అసంతృప్తి

చక్కదిద్దే పనిలో అధినేత 8లో

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా అనగాని



తిరుపతి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ నియమితులయ్యారు. మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు ఇంచార్జి మంత్రులను నియమించింది. అందులో భాగంగా తిరుపతి జిల్లాకు రెవిన్యూ మంత్రి సత్యప్రసాద్‌ను కేటాయించింది. రెవెన్యూ శాఖ మంత్రిగా ఉన్న కారణంగా జిల్లాలోని భూ వివాదాలపై ఆయన దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకునే అవకాశముంది.

భలేభలే బజ్జీలు



8లో

అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో గిడ్డయ్య

భాకరాపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీల అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమైనదని ఎంపీడీవో గిడ్డయ్య అన్నారు. మంగళవారం చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీల అభివృద్ధి ప్రణాళికల రూపొందించాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పంచాయతీకి మంజూరయ్యే నిధుల వినియోగం. ప్రణాళికలపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈవోపీఆర్‌ఆర్‌డీ సోమశేఖర రెడ్డి, కార్యదర్శులు మదనమోహన రాజు, రామ్మోహన్, రిసోర్స్ పర్సన్ లోకమూర్తి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

భాకరాపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో రామ్మోహన్ ఆదేశించారు. చిన్నగొట్టిగల్లు మండల పరిషత్ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారులతో సమన్వయం చేసుకుని చెరువులు, కుంటలు పరిశీలించాలన్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. వైద్యశాఖాధికారులు మందులు అందుబాటులో పెట్టుకోవాలన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు వంటి జీవాలకు నష్టం లేకుండా పశు వైద్య అధికారులు రైతులకు తగు సూచనలు ఇవ్వాలన్నారు. ముంపు ప్రాంతాలుంటే ప్రజలను చిన్నగొట్టిగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పునరావాస కేంద్రానికి తరలించాలన్నారు. తహసీల్దారు జనార్దన్‌రాజు, ఎంపీడీవో గిడ్డయ్య, డీటీ వాసుదేవకుమార్, అధికారులు పాల్గొన్నారు.

తమిళ భక్తులకు అన్నదానం



తిరుచానూరు. అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పెరటాసి మాసం సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనం కోసం చెన్నై నుంచి వచ్చిన భక్తులకు ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేఎస్ఆర్ కల్యాణమండపంలో ప్రతాప్ స్వామి మంగళవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, చెంగారెడ్డి, వాసు, బ్రహ్మానందం, జేజీ రెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌సీపురంలో భారీవర్షం



రామచంద్రాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఉదయం నుంచి భారీగా వాన కురుస్తుండటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్నపాటి వ్యాపారాలు చేసుకునేవారు ఇళ్లకే పరిమితమయ్యారు. వరి, వేరుశనగ నూర్పిళ్లకు అంతరాయం ఏర్పడింది. రెండు రోజులుగా వర్షం కురుస్తుండటంతో పశుగ్రాసం కుళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది. పొలాల్లో అక్కడక్కడ నీరు నిలిచింది.

ఆక్రమణదారులకు అధికారుల హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తిరుపతి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఆగని ఆక్రమణల పర్వం అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి తహసీల్దార్ రామాంజులు నాయక్ మంగళవారం స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు వీఆర్వో స్థలాల్ని పరిశీలించారు. ప్రభుత్వ భూమిలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టరాదని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఆక్రమణదారులను హెచ్చరించారు. గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలో పట్టాభూమిలో చేపడుతున్న ఇంటి నిర్మాణంలో సర్వేనెంబరు 208లోని కాలువ భూమి కొంతభాగం కలసి ఉందని సమాచారం. దీంతోపాటు రామదాసుకాలనీలోని కాలువ స్థలం, బాయమ్మతోట సమీపంలోని డీకేటీ భూములను సర్వేచేసి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆంధ్రజ్యోతికి వివరించారు

ఘాట్‌రోడ్డులో అదుపుతప్పిన టెంపో

● డ్రైవర్‌కు తీవ్రగాయాలు, మిగిలినవారికి స్వల్పగాయాలు



ప్రమాదస్థలంలో క్షతగాత్రులు

తిరుమల, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటిఘాట్ రోడ్డులో మంగళవారం ఓ టెంపో అదుపుతప్పి క్రాష్ బ్యారియర్‌ను ఢీకొంది. ఈప్రమాదంలో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. తమిళనాడుకు చెందిన 13 మంది భక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. తిరుచ్చికి చెందిన లోకనాథం 13 మంది కుటుంబ సభ్యులతో కలిసి శ్రీవారి దర్శనం కోసం తిరుపతి వచ్చారు. తిరుపతిలోని వెంకటేష్ అనే డ్రైవర్‌తో మాట్లాడి టెంపో వాహనంలో తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారు. మంగళవారం కొండ దిగువకు తిరుగు ప్రయాణమయ్యారు. మొదటి మలుపు వద్ద వాహనం ఒక్కసారిగా అదుపుతప్పింది. క్రాష్‌బ్యారియర్‌ను ఢీకొంది. దీంతో డ్రైవర్ వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డారు. వాహనంలోని భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను తిరుపతికి పంపారు. బ్రేక్ ఫెయిలవ్వడం వల్ల ప్రమాదం జరిగినట్టు డ్రైవర్ తెలిపాడు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.91 కోట్లు

తిరుమల, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.91కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయ వివరాలను టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. సోమవారం 75,361 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు.

చంద్రగిరి

నేడు మండల సర్వసభ్య సమావేశం

చంద్రగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో శేఖర్ తెలిపారు. ఈ సమావేశం ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన జరుతుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరవుతారన్నారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతిధులు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు హాజరుకావాలని శేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సీహెచ్‌సీలో రోగులకు నేటి నుంచి భోజన వసతి

చంద్రగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం(సీహెచ్‌సీ)లో ఇకపై రోగులకు భోజన సౌకర్యం కల్పించనున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ తెలిపారు. ఆసుపత్రిలో చికిత్స పొందే రోగులకు మూడు పూటలా ఉచితంగా భోజన సౌకర్యాన్ని కల్పించనున్నామన్నారు. ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పులివర్తి నాని బుధవారం ప్రారంభించనున్నట్లు తెలిపారు.

పల్లపు ప్రాంతాల్లో పునరావాస కేంద్రాల ఏర్పాటు

తిరుపతి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుపాను నేపథ్యంలో తిరుపతి రూరల్‌మండలంలోని పల్లపు ప్రాంత ప్రజల కోసం ప్రత్యేకంగా ఎనిమిది పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్ బి.రామాంజులు నాయక్ మంగళవారం ఈ విషయ తెలిపారు. తిరుచానూరు, ముండ్లపూడి, చిగురువాడ, పాడిపేట, పేరూరు, చెర్లోపల్లె, వేంకటపతినగర్‌లలో ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులు అప్రమత్తంగా ఉండి.. ఎక్కడైనా ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. ఎంపిక చేసిన అన్ని కేంద్రాలను ఎంపీడీవో రామచంద్రతో కలసి పరిశీలించినట్లు ఆయన చెప్పారు.

రేపు పౌర్ణమి గరుడసేవ

తిరుమల, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఈనెల 17న పౌర్ణమి గరుడసేవ జరుగనుంది. గురువారం రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వాలంకార భూషితుడైన మలయప్పస్వామి తన ఇష్టవాహనమైన గరుడునిపై కొలువుదీరతారు. మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.

పీజీ స్పాట్ అడ్మిషన్ల గడువు పెంపు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలో పీజీ స్పాట్ అడ్మిషన్ల ప్రవేశ గడువును పొడిగించారు. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ (డీఓఏ) కార్యాలయంలో సంప్రదించవచ్చు. పీజీసెట్‌లో ర్యాంకు పొంది, ఎక్కడా సీటు పొందని విద్యార్థులు ఇందుకు అర్హులు. యూనివర్సిటీలోని స్టేట్ బ్యాంకు బిల్డింగ్ పైన గల అడ్మిషన్స్ కార్యాలయంలో కానీ, 0877-2248589 నెంబరులో కానీ సంప్రదించవచ్చు. ఈ మేరకు వర్సిటీ అడ్మిషన్స్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ ఊకా రమేష్ బాబు తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

తిరుమల, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతి చెందింది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా..బాలాజీ బస్టాండ్ వద్ద ఈనెల 13న దాదాపు 80 ఏళ్ల వయసున్న వృద్ధురాలు అచేతనంగా పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. వెంటనే ఆమెను 108 అంబులెన్స్ ద్వారా అశ్విని ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతి రుయాకు పంపారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి 11.45 గంటలకు ఆమె మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని మెడికల్ కాలేజ్ మార్చురీకి పంపారు. మృతురాలి పేరు వెంకటమ్మ అని స్థానికులు చెబుతున్నారు. పూర్తి వివరాలు తెలియలేదు.

తిరువణ్ణామలైకి ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని తమిళనాడులోని పుణ్యక్షేత్రమైన తిరువణ్ణామలైకి ప్రత్యేకంగా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు సీటీఎస్ ఏటీఎం డి.రామచంద్ర నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం రాత్రి 8.40నుంచి గురువారం సాయంత్రం 4.50గంటల వరకు పౌర్ణమి ఘడియలు సంభవించనున్నాయి. బుధవారం ఉదయాత్పూర్వం 4గంటల నుంచి ప్రత్యేక బస్సులు ప్రారంభమై గురువారం మధ్యాహ్నం వరకు కొనసాగుతాయి. ప్రయాణీకుల సౌకర్యార్థం రిజర్వేషన్ సౌకర్యంతో పాటు నేరుగా వచ్చినవారికి కూడా నాన్‌ఏసీ, ఏసీ బస్సులను అందుబాటులో ఉంచనున్నారు. ముందస్తు రిజర్వేషన్ ద్వారా రాకపోకలకు టిక్కెట్ బుకింగ్ చేసుకుంటే 10శాతం రాయితీ సదుపాయం కల్పించారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం 99592 25686 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూలో ఇంజనీరింగ్, ఫార్మసీ కోర్సుల్లో పేమెంట్ సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఎంటెక్ (కెమికల్, సివిల్, కంప్యూటర్, ఎలక్ట్రికల్, కమ్యూనికేషన్స్, మెకానికల్ ఇంజనీరింగ్), బి-ఫార్మసీ, ఎం-ఫార్మసీ కోర్సుల్లో చేరడానికి ఆసక్తి కల్గిన వారు ఈ నెల 21వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్, పీజీఈసెట్, జి-ఫ్యాట్ ర్యాంకర్లకు ప్రాధాన్యం ఇస్తారు. ఎంటెక్‌కు రూ.1,42,980, ఎం-ఫార్మసీకి రూ.1,53,940, బి-ఫార్మసీకి రూ.81 వేలు ఫీజు నిర్ణయించారు. సమగ్ర సమాచారం కోసం.. ఎస్వీయూనివర్సిటీ.ఎడ్యు.. వెబ్‌సైట్‌లోగాని, డీఓఏ కార్యాలయంలో గాని సంప్రదించవచ్చు.

రేపు దుకాణాలకు వేలంపాట

నాగలాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయ ఆవరణలోని పలు దుకాణాలకు ఈనెల 17వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో లత పేర్కొన్నారు. కూల్‌డ్రింక్స్ షాపునకు వచ్చేఏడాది నవంబరు 4వ తేదీ వరకు, ఇత్తడి పూజ సామాన్లు, స్వామివారి వస్త్రాల విక్రయాలను వచ్చేఏడాది 30 వరకు, భక్తుల పాదరక్షలు భద్రపరిచి రుసుము వసూలు చేసుకోవడానికి వచ్చేఏడాది అక్టోబరు 4 వరకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు.

చీకటి పడితే ఆ దారిలో భయమే..

● తాగుబోతులకు అడ్డాగా డాలర్స్ కాలనీ



చంద్రగిరి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయలపురం పంచాయతీ పరిధిలో డాలర్స్ కాలనీ తాగుబోతులకు అడ్డాగా మారుతోంది. దీంతో ఆదారిలో వెళ్లాలంటే మహిళలు భయపడుతున్నారు. చంద్రగిరి పంచాయతీలోని ఇందిరమ్మ కాలనీ వద్ద ప్రభుత్వ మద్యం దుకాణం ఉంది. కొందరు అక్కడ మద్యం కొని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న డాలర్స్ కాలనీలో ఖాళీ ప్లాట్ల వద్దకు చేరుకుంటున్నారు. చెట్లు, ప్రశాంత వాతావరణం ఉండటంతో దీనిని వారు తమకు అనువుగా మార్చుకున్నారు. ఈ ప్రాంతంలో ఉదయం నుంచి రాత్రి వరకు గుంపులు, గుంపులుగా కూర్చొని తాగుతున్నారు. జాతీయ రహదారి నుంచి డాలర్స్ కాలనీ మీదుగా ఇందిరమ్మ కాలనీ వెళ్ళే మహిళలు వీరివల్ల ఇబ్బంది పడుతున్నారు. కాలనీలో వీధిలైట్లు లేవు. దీంతో రాత్రి పూట తాగుబోతులు రోడ్డుపై విచ్చలవిడిగా కూర్చుంటున్నారు. మద్యం తాగుతున్నారు. మహిళలు జాతీయ రహదారి నుంచి డాలర్స్ కాలనీ మీదుగా ఇందిరమ్మ కాలనీకి వెళ్ళాలంటే భయాందోళన చెందుతున్నారు. ఇందిరమ్మ కాలనీ వాసులు కూలి పనులకు వెళ్లి సాయంత్రం తిరిగి రావాలన్నా ఇబ్బంది పడుతున్నారు. పోలీస్ గస్తీ నిర్వహించాలని, వీధిలైట్లు వేయాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీస్ గస్తీ నిర్వహించాలి



రాత్రి పగలు తేడా లేకుండా మద్యం బాబులు గుంపులు, గుంపులుగా చేరుతున్నారు. ఇష్టానుసారం తాగుతున్నారు. మహిళలు ఆ దారిలో ఒంటరిగా వెళ్లాలన్నా భయపడుతున్నారు. రాత్రి వేళ వెళ్ళలేక పోతున్నారు. మా ప్రాంతంలోని డాలర్స్ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో పగలు, రాత్రి పోలీసులు గస్తీ నిర్వహించాలి.

- రామకృష్ణ, ఇందిరమ్మ కాలనీ

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు



డాలర్స్ కాలనీలో వీధిలైట్లు వేయాలని రాయలపురం పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. రాత్రి వేళ చంద్రగిరి నుంచి ఇందిరమ్మ కాలనీకి వెళ్ళాలంటే తాగుబోతులు గుంపులు, గుంపులుగా ఉంటున్నారు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. వీధి లైట్లు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుంది.

- బాలాజీ, ఇందిరమ్మ కాలనీ

ఇకపై పెట్రోలింగ్ నిర్వహిస్తాం



చంద్రగిరి పంచాయతీలో డాలర్స్ కాలనీ, ఇందిరమ్మ కాలనీల్లో మద్యం తాగి ఇబ్బంది పెడుతున్నారనే సమాచారం మాకు అందలేదు. ఇకపై ఈ రెండు కాలనీల పరిసరాల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తాం. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కేసులు నమోదు చేస్తాం. బాధితులెవరైనా మాకు సమాచారం తెలియజేయవచ్చు.

- సుబ్బరామిరెడ్డి, సీఐ, చంద్రగిరి.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యం

● పల్లెపండుగలో ఎమ్మెల్యే పులివర్తి నాని



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పులివర్తి నాని

పాకాల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో భాగంగా మంగళవారం దామలచెరువు పంచాయతీలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే పులివర్తి నాని శంకుస్థాపన చేశారు. పోలిశెట్టివారిపల్లె, మౌలాలిపేట, రాజీవ్ కాలనీల్లో జిల్లా పరిషత్ నిధులు రూ.61లక్షలతో పూర్తి చేసిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. అలాగే సిమెంటు రోడ్లు, మురుగు కాలువల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పాకాల, దామలచెరువు పంచాయతీ పరిధిలోని 28 హేబిటేషన్లలో రూ.2,65 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. తాగునీరు. రోడ్లు, డ్రైనేజి, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామన్నారు. పదేళ్లుగా మాజీ ఎమ్మెల్యే చేయలేని అభివృద్ధి పనులు తక్కువ సమయంలోనే పూర్తిచేస్తామన్నారు.

అసత్య ప్రచారాలపై చట్టపరంగా చర్యలు

సోషల్ మీడియా వేదికగా కొద్దిరోజులుగా కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే అన్నారు. వీరిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కొంతమంది సోషల్ మీడియా వేదికగా అసత్యాలను ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ వార్తలపై తన సతీమణి సుధారెడ్డి ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. తనకు లభిస్తున్న ఆదరణ సహించలేక బురద జల్లడానికి ప్రయత్నించేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదలిపెట్టమన్నారు. తన నిబద్ధతపై ప్రజాక్షేత్రంలో వచ్చి నిలదీయవచ్చన్నారు. పద్ధతి మార్చుకోకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు పాల్గొన్నారు.



రామచంద్రాపురంలో అవగాహన ర్యాలీ

నిర్దిష్ట అభ్యాస వైకల్యంపై అవగాహన ర్యాలీ

తిరుపతి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎంఆర్‌పల్లె ఎంపీపీ పాఠశాలలోని భవితకేంద్రంలో సమగ్ర శిక్ష సహితవిద్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్దిష్ట అభ్యాస వైకల్యంపై అవగాహనా ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం వి.సుభాషిణి ర్యాలీని ప్రారంభించి మాట్లాడుతూ.. చదువులో వెనుకబడిన విద్యార్థులకు ఐదురకాల లోపాలు ఉంటాయన్నారు. వీరికి ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా అభ్యసనా లోపాలను అధిగమించవచ్చని తెలిపారు.

ఎంజీఎంస్కూల్‌లో...

తిరుపతి(విద్య), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బైరాగిపట్టెడలోని ఎంజీఎం హైస్కూల్ ఆవరణలోని భవిత కేంద్రంలో సమగ్రశిక్ష సహిత విద్య విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహనా ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని జిల్లా సహితవిద్య కోఆర్డినేటర్ డి.చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. హెచ్‌ఎం కదిరి రవి, భవితకేంద్రం సహితవిద్య టీచర్లు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి నిర్దిష్ట అభ్యాస వైకల్య శిక్షణ ఉపయోగపడుతుందని మండల విద్యాశాఖ అధికారి మార్కొండయ్యనాయుడు అన్నారు. కమ్మకండ్రిగలో జడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్దిష్ట అభ్యాస వైకల్య జాగ్రుతిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వాగ్దేవి, ఉపాధ్యాయులు లీలారాణి, భవిత పాఠశాల ఉపాధ్యాయులు మనోహర్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో ..

చంద్రగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరిలో ర్యాలీని బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఈడీఎస్ఎస్ ఉపాధ్యాయులు ఉదయ్‌కుమార్, భవిత కేంద్రం ఉపాధ్యాయులు శ్యామలాదేవి, వెంకటరాజేశ్వరి, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

తిరుమలలో వానజల్లులు



తిరుమలలో భక్తుల మధ్యలో వాహనమండపంలో నిలుచుని ఉన్న ఏనుగులు

తిరుమల, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): తిరుమలలో మంగళవారం వేకువజాము నుంచి మధ్యాహ్నం వరకు చిరుజల్లులు పడుతూ, నిలుస్తూ ఉన్నాయి. మధ్యాహ్నం తర్వాత మొదలైన వర్షం రాత్రి వరకు పడుతూనే ఉంది. భక్తులు వర్షంలో తడుస్తూ శ్రీవారి దర్శనానికి వెళ్లడం.. దర్శనం పూర్తిచేసుకుని ఆలయం వెలుపలకు వచ్చిన వాళ్లూ తడిచారు. వృద్ధులు, చిన్నపిల్లలతో వచ్చిన భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక, చలి కూడా పెరిగింది. సాయంత్రం నిర్వహించే సహస్రదీపాలంకరణ సేవను వర్షం కారణంగా వైభోవత్సవ మండపంలో నిర్వహించారు. ఉత్సవమూర్తులను కూడా ఘటాటోపం కింద తీసుకువెళ్లారు. ఇక, ఎడతెరిపి లేకుండా వర్షం కురిసిన సమయాల్లో మొదటి, రెండవ ఘాట్‌రోడ్లలో కొండచరియలు విరిగిపడుతుంటాయి. కొండచరియలు విరిగిపడే ప్రాంతాలపై టీటీడీ నిఘా ఉంచింది. ఇంజినీరింగ్, విజిలెన్స్ ఫారెస్ట్ విభాగాలు తరచూ ఆయా ప్రదేశాలను సందర్శిస్తున్నారు. కొండచరియలు పడితే వెంటనే స్పందించేలా ఎక్స్‌కవేటరు, ట్రాక్టర్లను సిద్ధంగా ఉంచుకున్నారు. జీఎన్సీ, అలిపిరిలో వాహనాదారులను అప్రమత్తం చేసి పంపుతున్నారు. 'డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్ ఫోర్స్'ను కూడా సిద్ధం చేశారు.

నడికుడి - శ్రీకాళహస్తి భూసేకరణ పనులు వేగవంతం: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నడికుడి శ్రీకాళహస్తి మధ్య రైల్వే లైన్ కోసం పెండింగ్‌లో ఉన్న 182 ఎకరాల డీకేటీ భూములకు సంబంధించి భూసేకరణ పనులను వేగవంతం చేస్తామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. సీఎం కార్యదర్శి ప్రద్యుమ్న, రవాణా, ఆర్‌అండ్‌బీ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్‌దండే మంగళవారం జిల్లా అధికారులతో వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు. నడికుడి-శ్రీకాళహస్తి రైల్వేలైన్ భూసేకరణ పెండింగ్ పనులు సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. అలాగే తిరుపతి జాతీయ రహదారి పనులు వేగవంతం చేస్తామని కలెక్టర్ తెలిపారు. తిరుపతి-కాట్పాడి రైల్వేట్రాక్ డబుల్‌లైన్ నూతన ప్రాజెక్టుకు కూడా భూసేకరణకు చర్యలు చేపట్టామన్నారు. తిరుపతి నుంచి పాకాల రైల్వే ట్రాక్ డబుల్‌లైన్ పనులకు భూసేకరణ వేగవంతం చేస్తామని సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులకు వర్చువల్ విధానంలో కలెక్టర్ తెలియజేశారు. పాకాల, తిరుపతి, చంద్రగిరి మండలాల్లో 37 ఎకరాల భూసేకరణ చేపడుతున్నట్లు కలెక్టర్ వివరించారు. ఈ సమీక్షలో జేసీ శుభం బన్సల్ తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు సెల్‌ఫోన్ దొంగల అరెస్టు



మీడియా సమావేశంలో అదనపు ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఐదుగురు అంతర్ జిల్లా సెల్‌ఫోను దొంగల ముఠాను తిరుపతి ఈస్ట్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వారి నుంచి 32 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అదనపు ఎస్పీ రవిమనోహరాచ్చారి తెలిపిన ప్రకారం.. అన్నమయ్య జిల్లా కొట్టాలపల్లి గ్రామానికి చెందిన ఉప్పు మల్లికార్జున, తిరుపతి కొర్లగుంట మారుతీనగర్‌కు చెందిన తాండవ ముఖేష్, జగదీష్, శ్రీదేవి కాంప్లెక్సులో శక్తి మొబైల్ దుకాణం నిర్వహిస్తున్న మధురానగర్‌కు చెందిన అమరనాథరెడ్డి, కొర్లగుంటకు చెందిన కంచపు శ్రీనాథ్ కొంత కాలంగా మొబైల్ ఫోన్లు దొంగలించి విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 13న బైరాగిపట్టెడలోని భగత్‌సింగ్ కాలనీ ఆటో స్టాండ్ వద్ద కాపురమున్న ఆటో డ్రైవరు శ్రీనివాసులు తన మొబైల్ ఫోను దొంగలించారని ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఈస్ట్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేశారు. గతంలో సెల్‌ఫోను దొంగలు ఎవరున్నారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దీనికోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో మంగళవారం చింతలచేను లోని రామతులసి కల్యాణ మండపం వద్ద పోలీసులు గస్తీ నిర్వహిస్తుండగా అనుమానంతో తిరుగుతున్న వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో మొబైల్ ఫోన్ల దొంగతనం చేసిన ప్రాంతాలను గుర్తించి వారి ద్వారా వివిధ ప్రాంతాల్లో చోరీకి గురైన దాదాపు 32 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా అనుమతి లేకుండా సెల్‌ఫోన్ల లాక్‌లు ఓపెన్ చేసినా.. బిల్లులు లేని ఫోన్లు కొని విక్రయాలు జరిపినా చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

శాస్త్రోక్తంగా ప్రదోష పూజలు



నాగలాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మంగళవారం ప్రదోష పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలోని పరివార దేవతలకు ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ అభిషేకాలు చేసి విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పంచామృతంతో అభిషేకించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వివిధ పుష్పాలతో అలంకరించి నక్షత్ర, కుంభ, మహా హారతులు పట్టారు. భక్తుల శివనామస్మరణలతో ఆలయం మార్మోగింది. తదనంతరం ఉత్సవ మూర్తులైన వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిక అమ్మవార్లను సుందరంగా ముస్తాబు చేసి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత నేతృత్వంలో సిబ్బంది పర్యవేక్షించారు.

19 అడుగులకు చేరిన అరణియార్

పిచ్చాటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అరణియార్ నీటిమట్టం మంగళవారం సాయంత్రానికి 19 అడుగులకు చేరినట్లు ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. వర్షానికి ముందు వరకు ఈ ప్రాజెక్టులో 18అడుగుల వరకు నీరు ఉండేది. తుఫాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రాజెక్టు నీటి మట్టం అడుగు పెరిగింది. సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టుకు 160 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు ఏఈ వివరించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 31 అడుగులు(1.85 టీఎంసీలు)గా ఉంది. భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రాజెక్టుపై గట్టి నిఘా ఉంచారు. ఏఈ స్థాయి అధికారి 24 గంటలు ప్రాజెక్టు గేట్ల వద్దే ఉండి పర్యవేక్షించే విధంగా ఉన్నతాధికారులు, ప్రజలు చేపట్టారు.

శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం

వరదయ్యపాళెం, అక్టోబరు 15: మండలంలోని కువ్వాకొల్లి పంచాయతీ లక్ష్మీపురం(కె)లో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరాలయ మహాకుంభా భిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం గణపతిపూజ అనంతరం లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ శాంతిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం

- నగర ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు
- కమిషనర్ ఎన్.మౌర్య

తిరుపతి ఉపాధ్యాయనగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఎటువంటి కఠిన పరిస్థితులనైనా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య చెప్పారు. తుఫాన్ పరిస్థితుల నేపథ్యంలో మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ... రానున్న మూడు రోజులు తీవ్ర వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నగర ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని రకాల చర్యలు చేపట్టామని వివరించారు. అధికారులను, సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. విపత్తు నిర్వహణకు గాను మొత్తం 30 మంది ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది 24 గంటలూ సిద్ధంగా ఉంటారని తెలిపారు. పలువురు సిబ్బంది క్షేత్రస్థాయిలో ముమ్మరంగా విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. మురుగు కాలువలు పొంగిపొర్లకుండా ఎక్కడికక్కడ చెత్త చెదారాలను తొలగిస్తున్నట్టు తెలిపారు. వర్షపు నీరు ఎక్కువగా నిలిచే ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో సమస్యలు కలుగకుండా చర్యలు చేపట్టామన్నారు. అంటురోగాలు ప్రబలకుండా పారిశుధ్య పనులు చేపట్టిన వెంటనే బ్లీచింగ్ చేస్తామని చెప్పారు. దోమల నివారణకు అన్ని వార్డుల్లో స్ప్రేయింగ్, ఫాగింగ్ చేస్తున్నట్టు వివరించారు. తాగునీటిని ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేస్తున్నామని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లు, భవనాల్లో నివసిస్తున్నవారు తక్షణం పునరావాస కేంద్రాలకు రావాలని విజ్ఞప్తి చేశారు. అలాంటి వారు తమకు తెలియజేస్తే వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు. చెట్లు పడిపోయే స్థితిలో ఉంటే తమకు తెలియజేస్తే వాటిని తొలగించి రక్షణ చర్యలు తీసుకుంటామని తెలిపారు. వర్షాల కారణంగా ఏవైనా ఇబ్బందులు ఎదురైనా, డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లినా తక్షణమే హెల్ప్‌లైన్ నెంబరు 0877-2256766కు ఫోన్‌చేసి సమాచారం అందించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నగరంలో జోరు వాన

బస్టాండు, అండర్‌బ్రిడ్జిల వద్ద నిలచిన నీరు

పలుచోట్ల కూలిన చెట్లు



తిరుపతి ఆర్టీసీ బస్టాండులో నిలిచిన వర్షపునీరు



తిరుపతి అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నగరంలో మంగళవారం జోరు వాన కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తెరలు తెరలుగా కురిసినా మధ్యాహ్నం నుంచి ఎడతెరపిలేని వర్షం నమోదైంది. దీంతో ఉదయం, సాయంత్రం తడుస్తూనే విద్యార్థులు పాఠశాలలకు వెళ్లివచ్చారు. ఉద్యోగులు, ఇతర కూలీలు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. కూరగాయల మార్కెట్ల వద్ద గొడుగుల మాటున వ్యాపారాలు సాగించారు. ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తడిసిముద్దయ్యారు. వాణిజ్య సముదాయాలు బోసిపోయాయి. ఆర్టీసీ బస్టాండులో ప్రయాణీకుల రద్దీ తగ్గింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సైడు కాలువల నుంచి మురుగునీరు పొంగిపొర్లడంతో రోడ్లపై వ్యర్థాలు పేరుకున్నాయి. పలు వీధుల్లో గుంతలు ఏర్పడి, బురదమయమయ్యాయి. పలు ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. బస్టాండు, అండర్‌బ్రిడ్జిల వద్ద నీరు నిలబడిపోవడంతో ట్రాఫిక్ స్తంభించింది. శేషాచల కొండలపై దట్టంగా అలుముకున్న పొగమంచు సోయగం ఆకట్టుకుంది. మాలాడిగుండం, కపిలతీర్థం నుంచి జలధారలు కనువిందుచేశాయి. ఆకాశం మేఘాలతో కప్పబడి, వర్షం కారణంగా వాతావరణం చల్లబడింది. వర్ష ప్రభావం మరో రెండు మూడు రోజులు కొనసాగుతుందనే వార్తలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గుంతలమయంగా మారిన రోడ్డు



సుబ్బారెడ్డి నగర్‌లో గుంతలమయంగా మారిన శ్రీహాస్పిటల్ రోడ్డు



తిరుపతి (జీవకోన), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పరిధిలోని 1వ డివిజన్ సుబ్బారెడ్డినగర్‌లో గల శ్రీహాస్పిటల్ రోడ్డు గుంతలమయంగా మారింది. చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్డంతా నీటితో నిండిపోతోంది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో వర్షపునీటి ధాటికి గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక ప్రమాదాలు సంభవించే పరిస్థితి ఏర్పడింది. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తాత్కాలికంగా గుంతలకు మరమ్మతులు చేపట్టి పూర్తిస్థాయిలో రోడ్డు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి ఉపాధ్యాయనగర్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో నగరపాలక సంస్థ పరిధిలో వరద బాధితులకోసం ఏర్పాటుచేసిన 17 పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పోస్టల్‌కాలనీలోని నగరపాలక సంస్థ పాఠశాల, మంగళం తుడా క్వార్టర్స్‌లోని ఎంపీపీ స్కూల్, కొత్తపల్లి ప్రైమరీ స్కూల్, కొరమేనుగుంట రాజీవ్‌గాంధీ స్కూల్, ఆర్‌ఎస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్, మధురానగర్‌లోని ఎంయూపీ స్కూల్, ప్రియదర్శిని ఇంగ్లీష్ మీడియం స్కూల్, సంజయ్‌గాంధీ కాలనీలోని ఎంయూపీ స్కూల్, సత్యనారాయణపురంలోని జడ్పీ స్కూల్, కెనడీనగర్‌లోని డి అడిక్షన్ సెంటర్, ఎర్రమిట్టలోని రత్నం, శ్రీచైతన్య పాఠశాలలు, సింగాలగుంటలోని మున్సిపల్ స్కూల్, ఉప్పంగి హరిజనవాడ మున్సిపల్ స్కూల్, యశోదనగర్‌లోని లిటిల్ ఏంజిల్ స్కూల్, బైరాగిపట్టెడలోని రామానాయుడు స్కూల్, ఎల్‌బీ నగర్‌లోని కేశవరెడ్డి స్కూల్, వేశాలమ్మ గుడి వీధిలోని ఇందిరానగర్ స్కూళ్లను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. అన్ని కేంద్రాలకు ఇన్‌చార్జి అధికారులను నియమించామని, అవసరమైన ప్రజలు 0877 - 2256766 నెంబరులో హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని సూచించారు.

సైబర్ మోసగాళ్ల వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

- పోలీసులమని బెదిరించి రూ 4.90 లక్షల మోసం
- తిరుపతి రూరల్ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ముంబై పోలీసులమని చెప్పి బెదిరించి ఆన్‌లైన్ ద్వారా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నుంచి రూ.4.90 లక్షలు కాజేశారు. ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. దీనిపై మంగళవారం బాధితుడు నరేంద్ర తిరుపతి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. తిరుపతి రూరల్ పరిధిలోని ఎంకే నాయుడు కాలనీలోని నాగభూషణ్ కుమారుడు రావెళ్ల నరేంద్ర.. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. అతడికి హైదరాబాదు ఎస్‌ఆర్ నగర్‌లోని ఐసీఐసీఐ బ్యాంకులో అకౌంటు ఉంది. పదో తేది మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో 9296142185 నెంబరు నుంచి కాల్ చేసి తాము ముంబైలోని ఫెడెక్స్ కొరియర్ నుంచి కాల్ చేస్తున్నామని చెప్పారు. మీ పేరుతో ఇరాన్ వెళుతున్న పార్శిల్‌ను దుబాయ్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారని, అందులో మెడికల్ డ్రగ్స్ ఉన్నాయని, మిమ్మల్ని సైబర్ క్రైం పోలీసులు విచారించాలని, ముంబైకి రావాలని చెప్పారు. ఒకవేళ రాలేని పరిస్థితుల్లో స్కైప్ యాప్‌లో వీడియో కాల్ చేయాలని చెప్పడంతో అతడు భయాందోళన చెందారు. వెంటనే స్కైప్ వీడియో కాల్ ద్వారా వారితో మాట్లాడారు. తాము ముంబై పోలీసులమని బెదిరించి వారు పంపిన ఐదు లింకులు అప్‌లోడ్ చేశారు. దీంతో బాధితుడు నరేంద్ర అకౌంటులో ఉన్న రూ.5 లక్షలు.. లోను తీసుకున్నట్లు మెసేజ్ వచ్చింది. మీ డబ్బులు రూ.5లక్షలు అకౌంటులో ఉంటే ప్రమాదమని చెప్పి బెదిరించారు. మళ్ళీ వారు పంపిన మూడు అకౌంట్లకు రూ.4.90 లక్షలు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేయించారు. ఘటన జరిగిన తర్వాత సంబంధిత బ్యాంకు అధికారులు లోన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. దీంతో సైబర్ నేరగాళ్ల నుంచి మోసపోయామని గుర్తించి తిరుపతి రూరల్ స్టేషన్‌లో సీఐ చిన్నగోవిందుకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆ నాలుగు గంటల్లో కుమ్మేసిన వర్షం

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా సోమ, మంగళవారం రోజుల్లో ఒక మోస్తరుగా వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు భారీ వర్షం కురిసింది. అత్యధికంగా చిట్టమూరులో 109.2 మి.మి, వాకాడులో 80.4, కోటలో 68.2, దొరవారిసత్రంలో 60.2, పెళ్లకూరులో 56.4, చిల్లకూరులో 59.2, నాయుడుపేట 43.4, గూడూరు 41.6, ఓజిలిలో 41.8, వెంకటగిరిలో 37.6, తడలో 36.8, సూళ్లూరుపేటలో 36.6, డక్కిలిలో 36.2, శ్రీకాళహస్తిలో 34.2 మి.మి చొప్పున వర్ష పాతం నమోదైంది. జిల్లాలో ఆ నాలుగుగంటల్లో సగటు వర్షపాతం 34.4 మి.మి కాగా, గడిచిన రెండు రోజుల్లో సగటు వర్షపాతం 119.0 మి.మిగా నమోదైంది.

వర్షానికి కూలిన చింత చెట్టు

తొలగించిన పద్మావతి వర్సిటీ సిబ్బంది



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి పద్మావతి మహిళా యూనివర్సిటీలో దశాబ్దాల నాటి భారీ చింత చెట్టు నేల కూలింది. యూనివర్సిటీలోని హ్యూమనిటీస్ బ్లాక్ ఎదురుగా సోమవారం రాత్రి ఈ చెట్టు కూలి పోయినట్టు తెలుస్తోంది. చింత చెట్టు కాండం డొల్లగా ఉండటంతో కూలి పోయి ఉండొచ్చని యూనివర్సిటీ వర్గాలు చెబుతున్నాయి. సమాచారం తెలుసుకున్న యూనివర్సిటీ సిబ్బంది మంగళవారం కూలిన చింత చెట్టు తొలగింపు పనులు చేపట్టారు.

జాతీయ మత్స్యకారుల సంఘం జిల్లా నూతన కమిటీ నియామకం

తిరుపతి(ఎమ్మార్‌పల్లి), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ మత్స్యకారుల సంఘం తిరుపతి జిల్లా నూతన కమిటీ నియామకం మంగళవారం జరిగింది. ఏపీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో కపిలతీర్థం సర్కిల్‌లోని టీడీపీ కార్యాలయంలో తొలిసారి సమావేశం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర, జిల్లాల వారీగా నూతన కమిటీల నియామకం జరిగింది. కమిటీలో జిల్లా అధ్యక్షుడిగా ఆదిమూలం గిరి, మహిళా అధ్యక్షురాలిగా ఎస్ లక్ష్మీదేవిని నియమించారు. అలాగే రాష్ట్ర కమిటీలో సంయుక్త కార్యదర్శిగా ఆదిమూలం, దుర్గాభవాని, కార్యనిర్వాహక సభ్యులుగా పాతగుంట భక్తవత్సలంను ఎంపిక చేశారు. ఈసమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, రాష్ట్ర మత్స్యకారుల సంఘం అధ్యక్షుడు అప్పలరాజు, ఉపాధ్యక్షుడు గొల్ల ఏకాక్షరి తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ.. మత్స్యకారుల కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను, ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాల గురించి కమిటీ సభ్యులకు వివరించారు. మత్స్యకారుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

చెంగల్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలు



చెంగల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్టీసీ అధికారులు

తిరుపతి అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ ప్రధాన కార్యాలయానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న చెంగల్‌రెడ్డికి ఘనంగా వీడ్కోలుపలికారు. మంగళవారం సాయంత్రం ప్రజా రవాణాధికారి కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పలువురు అధికారులు ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా చెంగల్‌రెడ్డి చిత్తూరు డీపీటీవో జగదీష్‌కు తిరుపతి జిల్లా అదనపు బాధ్యతలు అప్పగించారు. తనకు సహకరించిన అధికారులకు, సిబ్బందికి, కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలువురు పూలమాలలు, శాలువలు కప్పి ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, సీఎంఈ నరసింహులు, పీవో షాహజాద్, డీఎంలు విశ్వనాథం, రామచంద్ర నాయుడు, బాలాజీ, హరిబాబు, ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రుయాలో గుండె జబ్బుల విభాగం ప్రారంభించాలి

కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్



తిరుపతి(వైద్యం), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుండె జబ్బుల బారిన పడుతున్న నిరుపేదలను దృష్టిలో పెట్టుకొని రుయాస్పత్రిలో గుండె జబ్బుల విభాగాన్ని తిరిగి ప్రారంభించాలని, ఇందుకు టీటీడీ తన వంతు సహకారాన్ని అందించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం కాంగ్రెస్ నేతలతో కలిసి రుయాస్పత్రిలో నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రుయాస్పత్రిలో నిరుపేదలకు అన్ని రకాల జబ్బులకు వైద్యం అందేదని, నేడు ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. ప్రధానంగా ఉండాల్సిన గుండె జబ్బుల విభాగాన్ని తొలగించి కేవలం ఓపీ వైద్య సేవలను అందించేందుకు నామ మాత్రంగా ఒక్క డాక్టరు మాత్రమే ప్రస్తుతం అందుబాటులో ఉండటం దురదృష్టకరమన్నారు. నెల రోజుల్లో రుయాస్పత్రిలో గుండె జబ్బుల విభాగాన్ని అందుబాటులోకి తీసుకురావాలని, లేనిపక్షంలో రుయాలో ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అనంతరం సూపరింటెండెంట్ రవిప్రభును కలిసి ఆస్పత్రిలోని సమస్యల గురించి మాట్లాడారు. కార్యక్రమంలో నేతలు యార్లపల్లి గోపీ గౌడ్, రవి, రావణ్, తేజోవతి, శాంతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



హరిప్రియ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ ఎడ్యుకేషన్ విభాగ స్కాలర్ సి.హరిప్రియ డాక్టరేట్ పొందారు. ఎ స్టడీ ఆఫ్ క్రిటికల్ థింకింగ్, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ అండ్ దైర్ ఎఫెక్ట్ ఆన్ అకడమిక్ అచీవ్‌మెంట్ ఇన్ సైన్స్ ఆఫ్ సెకెండరీ స్కూల్ స్టూడెంట్స్ అంశంపై ప్రొఫెసర్ సునీతబాయి పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

కలెక్టర్‌ను కలిసిన జిల్లా అటవీశాఖ అధికారి



కలెక్టర్ వెంకటేశ్వర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వివేక్

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీశాఖ అధికారిగా పి.వివేక్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మర్యాదపూర్వకంగా కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వియత్నాం సదస్సుకు పేటశ్రీ



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21 నుంచి 23వ తేదీ దాకా వియత్నాంలోని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ ఆర్ట్స్ ఎడ్యుకేషన్‌లో జరిగే అంతర్జాతీయ సదస్సులో ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి పరిశోధనా పత్రాన్ని సమర్పిస్తారు. పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతి జానపద కళలు అనే అంశంపై పత్రాన్ని సమర్పించనున్నారు. వియత్నాం రాజధాని నగరంలోని ఈ వర్సిటీ 'ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎమర్జింగ్ ట్రెండ్స్ అండ్ ఇన్నోవేషన్స్' మీద సదస్సు చేపట్టింది. గతంలో పేటశ్రీ ఆస్ట్రేలియా, చైనా, శ్రీలంక, థాయ్‌లాండ్, భూటాన్, ఇండోనేషియా, మలేషియా సదస్సుల్లో పాల్గొని పరిశోధనా పత్రాలు సమర్పించారు. ఎస్వీయూ తెలుగు రిటైర్డు ప్రొఫెసర్ పేట శ్రీనివాసులురెడ్డి, తిరుపతి కథలు, కొండ కథలు, తిరుపతి గంగజాతర, తిరువీధులు వంటి పాతిక పుస్తకాలు ప్రచురించారు.

జాతీయస్థాయి పోటీలకు అంధుల జట్టు ఎంపిక



తిరుపతి(క్రీడలు), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ వేదికగా ఈనెల 18నుంచి 22వ తేదీ వరకు జరగనున్న ఫస్ట్‌పార్శల్ బ్లైండ్ జాతీయ స్థాయి పోటీలకు రాష్ట్రస్థాయి జట్టును ఎంపిక చేశారు. మంగళవారం రాత్రి స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో జరిగిన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఎంపిక చేసినట్లు బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి పెంచల నరసయ్య నాయుడు తెలిపారు. తొలిసారిగా ఏపీ తరపున జట్టు ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు. జట్టుకు అభినందనలు తెలియజేస్తూ తప్పక విజయం సాధించాలని ఆకాంక్షించారు.

జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారీకి నిపుణుల సలహాలు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ తయారీ నేపథ్యంలో జిల్లా ప్రణాళికల్లో తిరుపతి ఐఐటీ, పలువురు నిష్ణాతుల సలహాలు, సూచనలు ఎంతగానో ఉపయోగపడుతాయని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం నుంచి తిరుపతి ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, నిపుణులతో స్వర్ణాంధ్ర-2047పై వర్చువల్ విధానంలో సమీక్షించారు. పూర్తిస్థాయిలో ఆచరణాత్మక జిల్లా విజన్ డాక్యుమెంట్ తయారీకి వారి సూచనలు, ఎంతగానో దోహదం చేస్తాయని కలెక్టర్ తెలిపారు.

టమోటా రైతుకు తీరని నష్టం



దెబ్బ తిన్న టమోటా

ఎర్రావారిపాలెం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు టమోటా పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. వానకు కాయలపై మచ్చలు ఏర్పడుతున్నాయి. దీంతో నాణ్యత తగ్గుతోంది. ప్రస్తుతం టమోటాకు రికార్డు స్థాయిలో ధర పలుకుతోంది. తోటల వద్దే కిలో రూ.వంద చెల్లించి వ్యాపారులు కొంటున్నారు. సాధారణంగా వర్షం పడిన 24 గంటల వ్యవధిలో వైరస్ నివారణకు మందులు పిచికారి చేయాలి. మందు పని చేయాలంటే పిచికారి చేశాక ఆరు గంటలైనా వర్షం తెరిపివ్వాలి. ఎడతెరిపి లేకుండా వాన కురుస్తుండటంతో నష్టం తప్పడం లేదు. మెట్ట భూముల్లో అధిక విస్తీర్ణంలో టమోటా సాగు చేశారు. బంతి, సంపెంగ, కాగడాలు, చామంతి పూల తోటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



'తడవబాకరా నాయనా.. తల తడిస్తే పడిసెం జేస్తాది' అని వానలో ఆడే పిలకాయల్ని అమ్మ మందలిస్తూ ఉంటుంది. వకుళమాత కోపం గుర్తుకొచ్చిందేమో మరి.. మంగళవారం సాయంత్రం సహస్రదీపాలంకరణ సేవ ఊరేగింపు కోసం బయట కొచ్చిన స్వామి ఘటాటోపం కిందకి చేరుకున్నాడు. తల తడిస్తే పడిసెం మాకు మాత్రం పట్టదా అని ఏనుగులు మహాలక్ష్మి, పద్మజ కూడా పందిరి కిందకు చేరుకున్నాయి, తడవకుండా.

- తిరుమల,ఆంధ్రజ్యోతి



ఒకటే జడివాన. మంగళవారం వేకువజాము నుంచీ చినుకులు పడుతూనే ఉన్నాయి. వాన నుంచి రక్షణగా తిరుపతిలోని ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్లో వ్యాపారులు ఇలా గొడుగులు పెట్టుకుని వ్యాపారం చేస్తూ కనిపించారు. కొనుగోలుదారులూ గొడుగులతో వచ్చారు. ఇలా మార్కెట్లో గొడుగుల సందడి కనిపించింది.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి



తిరుపతి మహానగరంగా మారిపోతున్నా.. శివారు ప్రాంతాలు మాత్రం పల్లె ఆచారాలను కాపాడుకుంటున్నాయి. జీవనకోనలో ప్రతిఏటా జరిగినట్టే భారతాలు జరుగుతున్నాయి. జీవలింగేశ్వరస్వామి గుడిలో మంగళవారం గీతావాణి ఆడిపాడి చెప్పిన హరికథ జనాన్ని అలరించింది. ఈ నెల 27 దాకా మహాభారత ఉత్సవాలు ఇక్కడ ఘనంగా జరుగుతాయి.

-తిరుపతి (జీవకోన), ఆంధ్రజ్యోతి



మహాత్ముడి తర్వాత దేశ ప్రజలంతా ఆరాధించిన నేత ఏపీజే అబ్దుల్ కలాం. అంతరిక్ష ప్రగతిలో ఆయన పాత్ర గొప్పది. కలాం జయంతి సందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు షార్ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ కె. నారాయణ. ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని విద్యార్థులకు సూచిస్తూ మంగళవారం సూళ్లూరుపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలాం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

-సూళ్లూరుపేట, ఆంధ్రజ్యోతి

STREET FOOD

భలే భలే బజ్జీలు













ఇక్కడ దొరికే బజ్జీలు:


మిర్చి బజ్జీ, టమోటా, క్యాప్సికం, బీరకాయ, అరటికాయ, వంకాయ, ఉర్లగడ్డ, సీమవంకాయ, గెనిసిగెడ్డ, సొరకాయ, యాపిల్, జామ, పైనాపిల్, మామిడి కాయ.

ప్రత్యేకత:
బజ్జీలకు సన్‌ఫ్లవర్ ఆయిల్ వాడుతారు. ఒక రోజు వాడిన నూనె మిగిలినా మరుసటి రోజుకి వాడరు.

ఎన్ని ఛాట్‌లు వచ్చినా మన బజ్జీని కొట్టే మొనగాడు ఫుడ్ లేదు. మరీ కాస్త చినుకు రాలి చల్లబడితే మనసు బజ్జీ మీదకు పోతుంది. మిర్చి బజ్జీ, అరటికాయ బజ్జీ, ఉర్లగడ్డ బజ్జీ.. మనకు తెలుసుగానీ 15 రకాల బజ్జీలు దొరికే ఒక చోటు తిరుపతిలో ఉంది. రాములవారి ఉత్తర మాడవీధిలో ఈ బజ్జీల బండి దగ్గర సాయంత్ర సమయాల్లో జనం కిటకిటలాడుతూ కనిపిస్తారు. మరిగే నూనెలోంచి కాలేకాలే బజ్జీలు ప్లేట్‌లో పెట్టి.. ఎండుమిరపకాయలు, అలసందలు, ధనియాలు, చెనిక్కాయ పప్పులతో కూడిన మసాలాను ఆ బజ్జీలలో కూరి ఇస్తారు. ఫైనల్ టచ్‌గా నిమ్మ దబ్బ పిండుతారు. సురేంద్ర ఆరేళ్లుగా ఈ బండి నిర్వహిస్తున్నారు. - తిరుపతి (జీవకోన)

బండి సమయం: సాయంత్రం 4 నుంచి రాత్రి 9 దాకా

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి పట్ల చంద్రబాబు నాయుడు తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేలు, ఇతర నాయకుల తీరుపై సమాచారం తెప్పించుకుంటున్న ఆయన జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దడం మీద దృష్టి పెట్టినట్టు చెబుతున్నారు.



తిరుపతి, ఆంధ్రజ్యోతి

తీరు బాలేదు తమ్ముళ్లూ!

- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ పరిస్థితిపై చంద్రబాబు అసంతృప్తి
- చక్కదిద్దే పనిలో అధినేత

గత ఐదేళ్ళు ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా వైసీపీ నేతలను మొక్కవోని స్థైర్యంతో ఎదుర్కొన్న టీడీపీ శ్రేణులు ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావడంతో పెద్ద ఎత్తున సంబరపడ్డాయి. అయితే వంద రోజులు కూడా గడవకమునుపే శ్రేణులు నిరుత్సాహానికి లోనయ్యాయి. పలువురు ఎమ్మెల్యేలు ప్రభుత్వం వచ్చీరాగానే సంపాదనపై దృష్టి మళ్ళించారని, పార్టీ పటిష్టతను వదిలేసి దానికే తొలి ప్రాధాన్యత ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. నిఘా వర్గాలతో పాటు పార్టీ పరంగానూ వేర్వేరు మార్గాల్లో అందిన సమాచారం ఆధారంగా జిల్లాలో ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు, ఇంఛార్జుల పనితీరును, వారి వ్యవహార శైలిని అధినేత చంద్రబాబు బేరీజు వేస్తున్నట్టు సమాచారం. ఎక్కువమంది ఎమ్మెల్యేలు పార్టీకోసం కష్టపడిన నాయకులను పట్టించుకోకుండా, తమకు అనుకూలురైన ఒకరిద్దరికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నారని, వారు చెప్పినట్టే వినాలని మండలస్థాయిలో అధికారులకు ఆదేశాలిస్తున్నారని అధినేతకు ఫిర్యాదులు అందాయి. ఇక శాసనసభలో ప్రమాణస్వీకారం చేసిన వెంటనే కొందరు ఎమ్మెల్యేలు ఇసుక మీద పడ్డారు. ప్రభుత్వ ఇసుక విధానం ఖరారు కాకముందే డంపుల్లో నిల్వవున్న ఇసుకను దౌర్జన్యంగా తెగనమ్మేసుకున్నారని అంటున్నారు. రెండు నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు. వైసీపీ నేతలు చేసిన భూ కబ్జా వ్యవహారాల్లో తలదూర్చి ఫిఫ్టీ: ఫిఫ్టీ పద్ధతిలో సర్దుడు బేరాలు మొదలు పెట్టేశారనే ఆరోపణలు ఉన్నాయి. తనకందుతున్న ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుంటున్న అధినేత ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలు, ఇంఛార్జుల పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్టు తెలిసింది. శ్రేణులను విస్మరించడాన్ని ఆయన తీవ్రంగా పరిగణిస్తున్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ ఎమ్మెల్యేలు లేని మూడు నియోజకవర్గాలకు గానూ రెండు చోట్ల ఇంఛార్జుల పనితీరుపై కూడా అధినేత అసహనంగా వున్నట్టు ఆ వర్గాలు చెబుతున్నాయి. ఓ నియోజకవర్గంలో ఇంఛార్జి పార్టీని గాలికొదిలేసినట్టు వ్యవహరిస్తుండడం, మరో చోట క్యాడర్ వాహనాల్లో అమరావతికి తరలివెళ్ళి ఇంఛార్జిపై ఫిర్యాదులు చేస్తుండడం పట్ల చంద్రబాబు సీరియస్‌గా వున్నట్టు సమాచారం.

సమన్వయపరిచే నాయకత్వంపై దృష్టి

ఉమ్మడి జిల్లాకు సంబంధించి పార్టీ పార్లమెంటు కమిటీల పేరిట మూడు ముక్కలైన సంగతి తెలిసిందే. అందులో రెండు కమిటీలకు సంబంధించి సమర్థ నాయకత్వం లేదని అధినేత భావిస్తున్నట్టు పార్టీ వర్గాల కథనం. కనీసం జిల్లా స్థాయిలో అభివృద్ధి ప్రతిపాదనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళేందుకు, నిధుల కోసం ప్రయత్నించేందుకు కూడా తగిన నాయకత్వం లేకపోవడాన్ని అధినేత గ్రహించినట్టు చెబుతున్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచీ ఎవరికీ మంత్రి పదవి కేటాయించకపోవడం కూడా ఈ పరిస్థితికి కారణం అంటున్నారు.ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పార్టీ వ్యవహారాలను చక్కదిద్దాల్సిన సీనియర్ నేతలు ఎవరి కారణాలతో వారు అసంతృప్తితో మిన్నకుండిపోయినట్టు అధినేత గుర్తించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వారిని చురుగ్గా పనిచేయించే దిశగా అధినేత దృష్టిసారించినట్టు తెలిసింది. అందులో భాగంగా ఇటీవల తిరుమలకు వచ్చిన చంద్రబాబు మాజీ మంత్రి అమరనాథరెడ్డితో ప్రత్యేకంగా మాట్లాడినట్టు సమాచారం. జిల్లా అభివృద్ధి ప్రతిపాదనలతో పాటు పార్టీ పరంగానూ చర్చించినట్టు తెలిసింది. మరింత లోతుగా చర్చించేందుకు, అవసరమైన నిర్ణయాలు తీసుకునేందుకు గానూ అమరనాథరెడ్డిని విజయవాడ వచ్చి తనను కలవాల్సిందిగా అధినేత సూచించినట్టు సమాచారం. దీంతో ఆయనకు ఉమ్మడి జిల్లా పార్టీ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగిస్తారా లేక ఆయనతో పాటు మరికొందరు సీనియర్, ముఖ్యనేతలను కూడా పిలిపించి ఉమ్మడిగా బాధ్యతలు అప్పజెబుతారా అన్న ఊహాగానాలు పార్టీ శ్రేణుల్లో వెలువడుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటై మంత్రివర్గంలో చోటు లభించకపోవడంతో పలమనేరు నియోజకవర్గానికే పరిమితమైన అమరనాథరెడ్డి అధినేతను ఇంతవరకూ ఒంటరిగా కలసి మాట్లాడలేదు.ఈ నేపథ్యంలో చంద్రబాబు, అమరనాథరెడ్డి మధ్య జరిగిన సంభాషణ రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. మొత్తం మీద అధినేత దృష్టి సారించడంతో ఉమ్మడి జిల్లాలో పార్టీ ద్వితీయ శ్రేణి నాయకులకు, కార్యకర్తలకు మేలు జరుగుతుందన్న ఆశాభావం మాత్రం ఆ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

స్వర్ణముఖికి పెనుముప్పు



దొరువుకట్ట వద్ద గండిపడ్డ పొర్లుకట్ట

- దెబ్బతిన్న పొర్లుకట్ట.. ప్రమాదం జరిగితే నాలుగు గ్రామాలు గల్లంతే

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్వర్ణముఖి పొర్లుకట్టలను నిర్లక్ష్యంగా వదిలేయడంతో పెనుముప్పుగా మారింది. కోట మండలం దొరువుకట్ట, పుచ్చలపల్లి గ్రామాల సమీపంలో స్వర్ణముఖి పొర్లుకట్టలు దెబ్బతిన్నాయి. గతేడాది మీచౌంగ్ తుఫాన్ కారణంగా స్వర్ణముఖి నది వరదనీరు ఉగ్రరూపం దాల్చడంతో కుడి, ఎడమ పొర్లుకట్టలు కోతకు గురవడంతో పాటు అక్కడక్కడ గండ్లుపడ్డాయి. అయినా, అప్పటి వైసీపీ ప్రభుత్వం ఎలాంటి మరమ్మతులు చేయలేదు. తాత్కాలికంగా పనులు చేపట్టడానికీ చొరవ చూపలేదు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి పూర్తిస్థాయిలో వరదనీరు వస్తే.. దెబ్బతిన్న పొర్లుకట్టకు పెనుముప్పు వాటిల్లే అవకాశం ఉంది. కోతకు గురైన, గండ్లుపడ్డ పొర్లుకట్టలు తెగితే అల్లంపాడు, దైవాలదిబ్బ, దొరువుకట్ట, పుచ్చలపల్లి గ్రామాలు గల్లంతయ్యే ప్రమాదం ఉంది. దీంతో స్థానికంగా ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



పుచ్చలపల్లి వద్ద కోతకుగురైన స్వర్ణముఖి పొర్లుకట్ట



బంతిపూలతోటను పరిశీలిస్తున్న ఉద్యాన అధికారి శైలజ

వర్షాలకు పంటను కాపాడుకోండిలా..

ప్రస్తుత వర్షాలకు రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే నష్టం వాటిల్లదంటున్నారు మండల వ్యవసాయాధికారి విజయభాస్కర్, ఉద్యాన అధికారి శైలజ. ఈమేరకు రైతులకు కొన్ని సూచనలు చేశారు.

- చంద్రగిరి, ఆంధ్రజ్యోతి

వరి: మొదటి, రెండో దశల్లో వర్షపు నీరు నిల్వ ఉంటే కాలువ ద్వారా బయటకు పారించాలి. కోత దశలో ఎక్కువ రోజులు పంట నీటిలో ఉంటే విత్తనాలు మొలకెత్తే అవకాశం ఉంది. దీని నివారణకు ఉప్పు ద్రావణం పిచికారి చేయాలి. వర్షంతో దెబ్బతిన్న పంట త్వరగా కోలుకోవాలంటే అదనంగా నత్రజని సంబంధిత ఎరువులను పిచికారి చేయాలి.

పూలతోటలు: మొక్కలపై 13:0:45 (నీటిలో కరిగే ఎరువు మల్టికే)ను గ్రాము, లేదా 2 గ్రాముల యూరియాను లీటరు నీటికి కలిపి 2, 3 సార్లు వారం రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. కోతకు సిద్ధంగా ఉన్న పువ్వులను వీలైనంత త్వరగా కోసుకోవాలి. ఆకుమచ్చ తెలుగు నివారణకు ప్రోపికొనజోల్ 1 మిల్లీ లేదా, అజాక్సిస్ట్రోబిన్ మిల్లీగ్రాములను లీటరు నీటిలో కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. తోటల్లో నిలువ ఉన్న అదనపు నీటిని పొలం చుట్టూ కాలువలు తీసి బయటకు పంపాలి. మొక్కలు బలంగా పెరగడానికి పోషకాలు అందించాలి. లేత తోటల్లో చనిపోయిన మొక్కలను తీసి తిరిగి నాటుకోవాలి.

ఉద్యాన పంటలు: వర్షాల వల్ల బంక నేలలో నీరు నిలిచిపోతుంది. నీరు ఎక్కువ నిల్వ లేకుండా వెంటనే బయటకు పంపించే మార్గం చూడాలి. భారీ వర్షాలకు 33 శాతం పైన నష్టం వాటిల్లితే కూరగాయలు, పూలతోటలకు 2.50 ఎకరాకు రూ.17వేలు నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుంది. మామిడి తోటలకు రెండున్నర ఎకరాలకు రూ.22500 చెల్లిస్తుంది.

కూరగాయల తోటలు: వర్షానికి పడిపోయిన మొక్కలను నిలబెట్టి మొదలు దగ్గర మట్టిని ఎగదోయాలి. మొక్క పెరుగుదల దశలో ఉంటే 13:0:45 (నీటిలో కరిగే మల్టికే) 2 గ్రాములు లేదా 2 గ్రాముల యూరియా ద్రావణాన్ని 2, 3 సార్లు మొక్క తడిసేలా వారం వ్యవధిలో పిచికారి చేయాలి. తెగుళ్ల ఉధృతి నేపథ్యంలో సాఫ్ 2.5 గ్రాములు, లేదా మాంకోజెట్ 2.5 గ్రాములు, జిగురు 0.5 ఎంఎల్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. వేరుకుళ్లు ఆశించిన నేలల్లో కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రాములు లేదా కార్బెండజిమ్ గ్రాము లీటరుకు కలిపిన ద్రావణాన్ని మొక్కల మొదళ్లలో పోయాలి.

వేరుశనగపంటలో జాగ్రత్తలిలా..

తిరుపతి రూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అధిక వర్షాల నేపథ్యంలో వేరుశనగ రైతులు నష్టనివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తిరుపతిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్త డాక్టర్ జాన్ వివరించారు. వివిధ దశల్లో ఉన్న వేరుశనగ పంటను కాపాడుకోవడంపై సూచనలు చేశారు. ఆ ప్రకారం.. వేరుశనగ విత్తనం వేసి 2-3 రోజుల సమయంలో ఉన్నప్పుడు నీటమునిగితే మొలకశాతం తగ్గుతుంది. ఈ దశలో వీలైనంత తొందరగా నీటిని బయటకు తీయాలి. ఈ దిశగా బోదెలు ఏర్పాటు చేసుకోవాలి. గింజ గట్టిపడే దశనుంచి చెట్టు పీకే వరకు.. నిద్రావస్థ కలిగిన రకాలలో పంటనష్టం తక్కువగా ఉంటుంది. నిద్రావస్థ లేనటువంటి రకాలు నీటమునిగితే గింజ మొలక వచ్చి ఎక్కువ నష్టాన్ని కలిగిస్తుంది చెట్టు పీకే దశలో ఉన్నట్లయతే చెట్ల మొదళ్లని నిటారుగా నిలబెట్టాలి. దీనివల్ల వర్షపునీరు కాయల మీద నిలబడదు. దీంతో కాయలోని గింజలు మొలకెత్తకుండా నివారించొచ్చు. పూర్తిగా ఆరని పంటని కుప్పలుగా వేసేటప్పుడు పీకిన వేరుశనగచెట్లపై టార్పాలిన్ పట్టలు కప్పుకోవాలి. కల్లాలపై ఉన్న నూర్పిడి చేసిన కాయలు వర్షానికి తడవకుండా చూసుకోవాలి.

రోడ్డంతా గుంతలే..!


గుంతలమయంగా ఉన్న పాతసంత రోడ్డు

గూడూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాతసంత రోడ్డు అడుగడునా గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకంగా మారింది. స్థానిక కోర్టు సెంటర్ సమీపంలో వెంకటగిరి - రాపూరు మార్గం నుంచి భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా పాతసంత రోడ్డు మీదుగా అంబేడ్కర్ నగర్ అండర్ బ్రిడ్జి ద్వారా నెల్లూరు - చెన్నై వైపునకు మినీ బైపాస్ ద్వారా వెళ్లేలా మళ్లించారు. గతంలో ఈ ప్రాంతంలో ప్రతి శుక్రవారం గొర్రెలసంత నిర్వహించేవారు. భారీ వాహనాలు ఈ దారిలో మళ్లించడంతో గొర్రెలసంతను చిల్లకూరు మండలం ముత్యాలపాడుకు తరలించారు. భారీ వాహనాలు వెళ్లేలా పాతసంత రోడ్డు మార్గాన్ని ఆర్అండ్బీ అధికారులు అభివృద్ధి చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం రోడ్ల అభివృద్ధికి ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో ఈ మార్గంలో దుస్థితికి చేరుకుంది. రాళ్లుతేలి గుంతలమయంగా మారింది. దీంతో భారీ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో దుమ్ములేచి సమీప నివాస గృహాల్లోకి చేరుతుండంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో గుంతల్లో నీరు చేరడంతో లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. అంతేకాకుండా ఈ రోడ్డుకు ఇరువైపులా కొబ్బరి బొండాలు, కోళ్ల వ్యర్థాలను వేస్తుండడంతో డపింగ్యార్డ్ను తలపిస్తూ దుర్వాసన వ్యాపిస్తోందని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి పాతసంత రోడ్డును బాగు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ఈ దారిలో ప్రయాణమెలా?


బురదమయంగా ఉన్న ప్రధాన రహదారి

నాయుడుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఉన్న నాయుడుపేట-శ్రీకాళహస్తి రోడ్డు రోడ్డు అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతంలో గాంధీ మందిరం పార్కు, విద్యాలయాలు ఉండటంతో విద్యార్థులు రాకపోకలు సాగిస్తూ ఉంటారు. అంతే కాకుండా ఈ రహదారి ద్వారా మేనకూరు సెజ్లోని పరిశ్రమలకు వెళ్లే వాహనాలు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి అడుగడుగునా గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా ఉంది. గోమతి సర్కిల్ నుంచి కరెంట్ ఆఫీసు వరకు ఏపీఐఐసీ నిధులతో డబల్ లైన్ సిమెంటు రోడ్డు నిర్మించి, ఆపై వదిలివేశారు. అక్కడ నుంచి పార్కు వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. గుంతలు ఏర్పడి కొద్దిపాటి వర్షానికే నీరుచేరి రాకపోకలకు ఇబ్బందిగా ఉండడంతో పాదచారులు, వాహనదారులు అవస్థలు పడాల్సి వస్తుంది.

వివాహిత ఆత్మహత్యపై అధికారుల విచారణ


దండవోలు గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

డక్కిలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని దండవోలు గ్రామానికి చెందిన ఏకోలు చెంచులక్ష్మి ఆత్మహత్యకు దారితీసిన పరిస్థితుల గురించి నెల్లూరు జిల్లా ఐటీడీఏ పీవో పరిమల, తిరుపతి జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి సూర్యనారాయణ, డక్కిలి తహసీల్దార్ శ్రీనివాసులు మంగళవారం గ్రామంలో విచారించారు. మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడారు. అనంతరం తహసీల్దారు శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ చెంచులక్ష్మి బంధువుల నుంచి స్టేట్మెంటు రికార్డు చేసినట్లు తెలిపారు. మృతురాలు గిరిజన కుటుంబానికి చెందిన మహిళ కావంతో ఆర్థిక సాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు చెప్పారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య, జిల్లా అధ్యక్షుడు తలపల చెంచుమల్లి కార్జన రావు, మహిళా ఉపాధ్యక్షురాలు చెంబెటి ఉష, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇండ్ల మల్లికార్జున, జైభారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి తలారి నాగరాజు, నవజీవన్ ఆర్గనైజింగ్ సభ్యుడు రమేష్ పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు చేపడుతామని డీఎస్పీ రమణకుమార్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక రెండో పట్టణ పోలీస్స్టేషన్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సైదాపురం గ్రామానికి చెందిన ఓ బాలుడు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి తరువాత చదువు మానేసి పట్టణంలోని ఎస్కేఆర్ కళాశాల సమీపంలోని బంధువుల ఇంట్లో ఉంటున్నాడన్నారు. ఈ ఏడాది ఆగస్టు 20వ తేదీన బాలుడికి తిలక్నగర్కు చెందిన మరో బాలుడితో చిన్నపాటి వివాదం జరిగింది. గాంధీనగర్ సమీపంలోని సబ్స్టేషన్ వద్ద సైదాపురానికి చెందిన బాలుడిని తిలక్నగర్కు చెందిన బాలుడుతోపాటు అతని స్నేహితులు కొందరు మాట్లాడాలని పిలిచి నిర్బంధించి దాడి చేశారని తెలిపారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామని బెదిరించడంతో ఫిర్యాదు ఇచ్చేందుకు బాధితుడు భయపడ్డాడని, అయితే మంగళవారం రెండో పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడన్నారు. దీనిపై విచారణ చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్బాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముంపునకు గురికాకుండా చర్యలు

నాయుడుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా ఆధ్వర్యంలో ప్రధాన డ్రైనేజీల పూడికతీత తీయించే పనులు చేపట్టారు. గతంలో కురిసిన భారీ వర్షాలకు తుమ్మూరు, రాజీవ్గాంధీకాలనీ, ఎల్ఏసాగరం, బీడీకాలనీ తదితర ప్రాంతాలు నీటమునిగాయి. ఈ నేపథ్యంలో ముందు జాగ్రత్తగా ఆయా ప్రాంతాల్లోని ప్రధాన డ్రైనేజీలలో ఎక్స్కవేటర్తో పూడికతీత పనులు చేపట్టారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో సూళ్లూరుపేట డివిజన్లో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆర్డీవో కిరణ్మయి ఆదేశించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తడ, సూళ్లూరుపేట మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ సూళ్లూరుపేట ప్రాంతంపై తుఫాన్ అధిక ప్రభావం చూపే అవకాశం ఉందని, ఎటువంటి విపత్తు జరిగినా ఎదుర్కొనేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసి అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు, తడ, సూళ్లూరుపేట తహసీల్దార్లు, శరత్బాబు, నరసింహరావు, సీఐ మురళీకృష్ణ, ఎంపీడీవో ప్రమీలారాణి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్లవద్దు: ఆర్డీవో


భీములవారిపాళెంవాసులతో మాట్లాడుతున్న ఆర్డీవో

తడ, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు అధికారులంతా సిద్ధంగా ఉన్నామని సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి తెలిపారు. మంగళవారం భీములవారిపాళెం పడవలరేవుకు వచ్చిన ఆమె అక్కడ పరిస్థితులను పరిశీలించారు. వేటకు వెళ్లవద్దంటూ మత్స్యకారులకు సూచించారు. అత్యవసర పరిస్థితులు ఉంటే తప్ప బయటకురావద్దని ఇరకందీవి గ్రామస్తులను అప్రమత్తం చేశారు. నిత్యావసర సామగ్రి, గజ ఈతగాళ్లు, పడవలు అందుబాటులో ఉంచామని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అవసరమైతే పునరావాస కేంద్రాలకు తరలిస్తామని చెప్పారు. ఆర్డీవో వెంట తహసీల్దారు శరత్బాబు, ఎంపీడీవో విజయ్కుమార్, ఎస్ఐ కొండపనాయుడు తదితరులు ఉన్నారు.

కుండపోత వర్షం

గూడూరు/పెళ్లకూరు/సూళ్లూరుపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా మంగళవారం గూడూరు పట్టణంలో కుండపోత వర్షం కురిసింది. ఉదయం వర్షం కురిసినా సాయంత్రం వరకు తెరపిచ్చి ఆకాశం మేఘావృతంగా మారింది. సాయంత్రం 6గంటల నుంచి రాత్రి వరకు కుండపోత వర్షం కురిసింది. వర్షం కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లపై వర్షపునీరు ప్రవహిస్తుండడంతో పాదచారులు, ద్విచక్రవాహనదారులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడాల్సివచ్చింది. స్థానిక సబ్కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి తీరప్రాంతాల్లో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమీక్షిస్తున్నారు. ● పెళ్లకూరు మండలంలో కుండపోత వర్షం కురుస్తోంది. మంగళవారం సాయంత్రం నుంచి ఎడతెరిపి లేని వర్షం పడుతోంది. దీంతో వాగులు, వంకలు పొంగిపొర్లుతూ చెరువులకు నీరు చేరుతుంది. మరో మూడు రోజులుగా వర్షాలు పడతాయని వాతావరణ శాఖ ప్రకటించడం.. ఉరుములు, మెరుపులు ఎక్కువగా ఉండడంతో వర్షం తగ్గుముఖం పట్టే వరకు ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని తహసీల్దార్ ద్వారకానాథ్రెడ్డి సూచించారు.


పెళ్లకూరులో జలమయమైన రోడ్డు


సూళ్లూరుపేటలో వర్షం

సూళ్లూరుపేటలో 66.6 మి.మీ. వర్షపాతం

సూళ్లూరుపేటలో సోమవారం అర్ధరాత్రి నుంచి మొదలైన వాన మంగళవారం ఉదయం 10 గంటల వరకు తెడతెరిపి లేకుండా కురిసింది. మళ్లీ మధ్నాహ్నం 3 గంటల నుంచి ఉరుములతో కూడిన వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. 66.2 మి.మీ. వర్షపాతం నమోదయ్యింది. వర్షంతో పాటు చలి తీవ్రత అధికంగా ఉండడంతో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. తేలికపాటి గాలులతో పాటు ఉరుములు తోడవ్వడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బాపూజీ వీధి, జీఎన్టీ రోడ్డు, సాయినగర్, సూళ్లూరు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆగిపోయింది. ఎస్పీడీసీఎల్ అధికారులు వెంటనే స్పందించి పునరుద్ధరణకు పనులు చేపడుతున్నారు. ఇప్పటి వరకు ఎటువంటి నష్టం జరగకపోయిన మరో రెండు రోజులు తుఫాన్ ప్రభావం ఉండడంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కాకుల సరదా... కరెంటోళ్లకు కష్టం

● మాడిపోయిన ట్రాన్స్ఫార్మర్ల ఫీజులు
● ఇళ్లలో కాలిపోయిన మీటర్లు, గృహోపకరణాలు




కాలిపోయిన విద్యుత్ మీటరు - కాకులు వాలిన ట్రాన్స్ఫార్మర్ ఇదే

తడ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రెండు కాకుల సరదా కరెంటోళ్లకు కష్టం తెచ్చిపెడితే... కొన్ని ఇళ్లల్లో విద్యుత్ మీటర్లు, గృహోపకరణాలు కాలిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో రాత్రంతా విద్యుత్ లేక జనం అవస్థలు పడ్డారు. సోమవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో తడ రైల్వేస్టేషన్కు వెళ్లే దారిలోని సర్వీస్రోడ్డులో ఉన్న ట్రాన్స్ఫార్మర్ వద్ద రెండు తీగలపై రెండు కాకులు వాలాయి. అవి సరదాగా అటుఇటు కదుతుండగా రెండు కాకుల రెక్కలు కలుసుకోవడం ఒక్కసారిగా ట్రాన్స్ఫార్మర్లోని ఫీజులు పెద్ద శబ్దంతో తెగిపోయాయి. ఆ స్తంభాల నుంచి వెళ్తున్న 11 కేవీ లైన్ తెగిపోయి దాని కింద మరో లైన్పై పడింది. దీంతో ఆ చుట్టుపక్కల ఉన్న ఐదు ట్రాన్స్ఫార్మర్ల ఫీజు వైర్లు పెద్దశబ్దంతో ఒకేసారి కాలిపోయాయి. ఒక్కసారిగా హైవోల్టేజీ సరఫరా కావడంతో కొన్ని ఇళ్లకు ఉన్న విద్యుత్ మీటర్లు మలమలా మాడిపోగా, పలు ఇళ్లల్లో లైట్లు, టీవీలు, వాషింగ్ మిషన్ వంటి గృహోపకరణాలు కాలిపోయాయి. ఈ ప్రమాదంతో తడ సబ్ స్టేషన్లో ఫీజులూ దెబ్బతిన్నాయి. రెండు కాకుల సరదాతో ప్రమాదం సంభవించడంతో విద్యుత్శాఖ అధికారులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. మంగళవారం ఉదయం 11 గంటలకు మరమ్మతులు ముగించి పూర్తిస్థాయిలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించగలిగారు. రాత్రంతా రైల్వేస్టేషన్ రోడ్డులోని పలు గృహాలకు విద్యుత్ సరఫరా లేక జనం ఇబ్బంది పడటమే కాకుండా గృహోపకరణాలు కాలిపోవడంతో లబోదిబోమంటున్నారు. ఈ ప్రమాదంలో సుమారు 50 వరకు విద్యుత్ మీటర్లు కాలిపోయాయని, మరికొన్ని మీటర్లల్లో చిన్నపాటి సమస్యలు ఏర్పడ్డాయని ట్రాన్స్కో ఏఈ మురళి తెలిపారు.

ప్రమాదకరంగా పాఠశాల భవనం

గుడిలో తరగతుల నిర్వహణ




పెచ్చులూడి పడుతున్న పాఠశాల పైకప్పు - వరండాలో వర్షపునీరు - గుడిలో తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు

పెళ్లకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యాలకారికండ్రిగలో ప్రాథమిక పాఠశాల భవనం ప్రమాదకరంగా ఉంది. పాఠశాల భవనం పెచ్చులూడి పడుతుండడంతో గ్రామంలోని గుడిలో మంగళవారం తరగతులు నిర్వహించారు. మండల కేంద్రమైన పెళ్లకూరుకు సుమారు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న చింతపూడి పంచాయతీ పరిధిలో యాలకారికండ్రిగ గ్రామం, గంగరాజుకండ్రిగ దళితవాడ ఉన్నాయి. ఈ రెండు గ్రామాలకు యాలకారి కండ్రిగలో ప్రాథమిక పాఠశాల ఉంది. సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించిన పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో భవనం శ్లాబు పెచ్చులూడి పడుతోంది. ఇది చూసి భయాందోళన చెందిన కొందరు తమ పిల్లలను ఇతర ప్రాంతాల్లోని ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. ప్రస్తుతం కేవలం పది మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. సోమవారం నుంచి కురుస్తున్న వర్షాలకు పాఠశాల భవనం ఉరుస్తూ పైనుంచి పెచ్చులూడి పడుతుండడంతో మంగళవారం ఏడుగురు విద్యార్థులు పాఠశాలకు రాలేదు. హాజరైన ముగ్గురు విద్యార్థులకు గ్రామంలో ఉన్న శ్రీరాముడి ఆలయంలో తరగతులు నిర్వహించారు. శిథిలావస్థకు చేరిన పాఠశాల గురించి పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందని, ప్రభుత్వం స్పందించి నూతన భవనం నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గ్రామాల అభివృద్ధికే పల్లెపండుగ


అలిమిలిలో శంకుస్థాపన చేస్తున్న అధికారులు

బాలాయపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి కోసమే పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వినీల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని అలిమిలిలో రూ.10లక్షలు, మన్నూరులో రూ.10 లక్షలు, పల్లిపాడులో రూ.8 లక్షలు, గొట్టికాడులో రూ.8 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఈవోపీఆర్డీ మోహన్రాజు, ఏపీవో మృత్యుంజయరావు, నాయకులు రాయి సత్యంనాయుడు, రఘురెడ్డి, పగడాల వెంకటరమణ, బద్దెవోలు కల్యాణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు హెచ్చరిక

కోట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కోటలోని ఓ ప్రైవేటు పాఠశాలకు మంగళవారం అధికారులు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్ అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు కళాశాలలకు మంగళవారం కూడా సెలవు ఇచ్చినప్పటికి ఒక పాఠశాలలో తరగతులు నిర్వహించారు. ఈ విషయం తెలియడంతో తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో వేణు, ఎంఈవో మస్తానయ్య పాఠశాలను సందర్శించి తరగతులు నిర్వహించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటన మరొక్కసారి జరిగితే పాఠశాల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

భయం గుప్పెట్లో ఉన్నాం... ఆదుకోండయ్యా


గంగిటివానిదిబ్బలో గ్రామస్థులతో అధికారులు

కోట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎన్నడూ లేని విధంగా బకింగ్హాం కెనాల్కు వరదనీరు పోటెత్తుతోందిన, ఏ క్షణంలో అయినా కెనాల్ నీరు గ్రామాన్ని ముంచెత్తే అవకాశం ఉండడంతో తమను ఆదుకోవాలంటూ మంగళవారం సిద్ధవరం పంచాయతీలోని గంగిటివానిదిబ్బ గ్రామస్తులు అధికారులను వేడుకున్నారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు కాకినాడ నుంచి చెన్నై వెళ్లే బకింగ్హాం కెనాల్ గంగిటివాని దిబ్బమీదుగా గోవింద పల్లిపాళెం సముద్రంలో కలుస్తుంది. కెనాల్కు వరదపోటు రావడం ఏక్షణంలో అయినా తెగిపోతే గ్రామంలోకి నీరు చేరి 30 కుటుంబాలు గల్లంతయ్యే అవకాశం ఉందని రెండు రోజులక్రితం స్థానికులు కలెక్టర్ను ప్రాధేయపడ్డారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తహసీల్దారు జయజయరావు, పలు శాఖల అధికారులు గంగిటివానిదిబ్బ గ్రామం, బకింగ్హాం కెనాల్ను పరిశీలించారు. ఇబ్బంది ఎదురైతే సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్నామని గ్రామస్తులకు అధికారులు భరోసా ఇచ్చారు.

కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలి

గూడూరు అర్బన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్కలాంను యువత ఆదర్శంగా తీసుకోవాలని డీఆర్డబ్ల్యు కళాశాల ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. మంగళవారం కళాశాలలో అబ్దుల్ కలాం జయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అబ్దుల్కలాం దేశానికి ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన సూచించిన మార్గంలో విద్యార్థులు నడుస్తూ శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో అబ్దుల్కలాం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్, మయూరి శ్యామ్యదవ్, సునీత, విద్యార్థినులు పాల్గొన్నారు.

తీరప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి


ఉప్పుటేరు నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు శ్రీనివాసులు

చిల్లకూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా భారీ వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు శ్రీనివాసు అన్నారు. మత్స్యకారులు సముద్రంలోకి వేటకు వెళ్లవద్దని సూచించారు. తమ్మనపట్నం, గోనుంటపాళెం, తిప్పగుంటపాళెం గ్రామాలను సందర్శించారు. గోనుగుంటపాళెం లోతట్టు ప్రాంతమైన గిరిజన కాలనీలోని వర్షపునీరు నిల్వ చేరకుండా సమీపంలోని బకింగ్హాం కెనాల్లోకి యంత్రాల సాయంతో కాలువ తీసి నీటిని మళ్లించే చర్యలు చేపట్టారు. తమ్మినపట్నంలో మత్స్యకారులకు వేటకు వెళ్లరాదని సూచించారు. తిప్పగుంటపాళెం సమీపంలోని ఉప్పుటేరు నీటి మట్టాన్ని పరిశీలించి గ్రామస్తులకు అప్రమత్తం చేశారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు ఉన్నారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

గూడూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఎటువంటి నష్టం జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా సైక్లోన్ నోడల్ అధికారి ఆదిశేషయ్య అన్నారు. మంగళవారం స్థానిక గోగినేనిపురంలోని విద్యుత్ కార్యాలయంలో ఈఈ నరేంద్రరెడ్డితో సమీక్ష నిర్వహించారు. తుఫాన్ కారణంగా ఎటువంటి విపత్తులు ఎదురైనా ఎదుర్కొనేందుకు సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ స్తంభాలను, తీగలను సెక్షన్ ఆఫీసులో సిద్ధంగా ఉంచుకుని, అవసరమైన చోట పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా స్థానిక చిల్లకూరు సబ్స్టేషన్లో సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు అందజేశారు.

వీఆర్వోలు గ్రామాల్లోనే ఉండాలి

ఓజిలి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుపాను హెచ్చరికల నేపథ్యంలో వీఆర్వోలంతా తమకు కేటాయించిన గ్రామాలలో అప్రమత్తంగా ఉండాలని ఓజిలి మండల తహసీల్దారు పద్మావతి మంగళవారం తెలిపారు. తహసీల్దారు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ వరకు భారీ వర్ష సూచనలు ఉన్న కారణంగా ఈ హెచ్చరికలు చేశారు. ఎప్పటికప్పుడు గ్రామాలలో పరిస్థితులను మండల కేంద్రానికి తెలియజేయాలని ఆమె సూచించారు. భారీవర్షం ముంపునకు గురయ్యే ప్రాంతాలలో ముందస్తు చర్యలతో సిద్ధంగా ఉండాలని తహసీల్దారు తెలిపారు. ఈసందర్భంగా మండల డిప్యూటీ తహసీల్దారు మధుసూదనరాజు ఉన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: విజయశ్రీ


వట్రపాలెంవాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. మంగళవారం రాత్రి ఆమె అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి లోతట్టు ప్రాంతమైన వట్రపాలెంలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. మరో రెండు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, లోతట్టు ప్రాంతాల ప్రజలు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. ఏ సమస్య వచ్చిన వెంటనే అధికారుల దృష్టికి తేవాలన్నారు. మరో రెండు అత్యవసరమైతే తప్ప బయటకు రాకుండా ఇళ్లలోనే ఉండాలన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, తహసీల్దార్ నరసింహరావు, టీడీపీ నాయకులు టి.సుధాకర్ రెడ్డి, ఏజీ కిషోర్, రమణయ్య, ఆలీభాయ్, శివ తదితరులు ఉన్నారు.

అంధులకు జాతీయస్థాయి క్రీడా పోటీలు

వెంకటగిరి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గరుజరాత్ వేదికగా ఈనెల 18 నుంచి 22వ తేదీ వరకు అంధులకు జాతీయస్థాయి క్రీడా పోటీలను తొలిసారి నిర్వహిస్తున్నట్లు అంధుల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పచ్చూరి పెంచల నరసయ్య నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ నుంచి తొలిసారి అంధుల అసోసియేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు జాతీయస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటున్నారని తెలిపారు. ఈ పోటీలకు ఎంపికైన వారికి క్రీడా పరికరాలను అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వినయ్ కుమార్, సభ్యుడు రంగినేని రాజా అందజేశారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన అంధులు

పల్లె ప్రగతికి కృషి చేస్తా: ఎమ్మెల్యే సుధీర్


శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలో పల్లెల ప్రగతికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బీవీపురంలో రూ.10లక్షలతో నిర్మించనున్న రోడ్లకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా గ్రామస్థాయితో తీసుకున్న తీర్మానాల్లో రూ.8కోట్ల పనులను ప్రారంభించినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో నియోజక వర్గంలో ప్రజల సౌకర్యార్థం మరన్ని రోడ్లను నిర్మిస్తామన్నారు. టీడీపీ నాయకులు తాటిపర్తి ఈశ్వర్‌రెడ్డి, రవీంద్రనాథరెడ్డి, చెంచయ్యనాయుడు, అధికారులు తదితరుల పాల్గొన్నారు.

నేడు పల్లెపండుగ

ఏర్పేడు: మండలంలో బుధవారం జరగనున్న పల్లెపండుగ కార్యక్రమంలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి పాల్గొననున్నారు. ఉదయం 9.30గంటలకు ముసలిపేడు, సరస్వతికండ్రిగ, 10గంటలకు మాధవమాల, 10.30 గంటలకు ఇసుకతాగేలిలో పాల్గొంటారు.

నక్కల కాలనీ పరిశీలన


కాలనీవాసులతో మాట్లాడుతున్న ఆర్డీవో

రేణిగుంట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే గేటు సమీపంలో ఉన్న నక్కలకాలనీని ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి మంగళ వారం పరిశీలించారు. రేణిగుంట, తిరుపతి బై పాస్ రైల్వేట్రాక్ నిర్మాణంలో నక్కల కాలనీ పోతుండటంతో ఈ ప్రాంతాన్ని పరిశీలించి స్థానికులతో చర్చించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ... దశాబ్దాల క్రితం ఊరు బయట తమకు ఈ కాలనీ ఏర్పాటు చేసుకుని బతుకుతున్నామని, రైల్వేస్టేషన్ ఉండటంతో పూసలమ్మి జీవిస్తున్నామన్నారు. ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలను ప్రభుత్వ అవసరాలకు తీసుకునే హక్కు ఉందని ఆయన అవగాహన కల్పించారు. నిర్వాసితులకు మరో ప్రదేశంలో ఇంటి స్థలాలు ఇచ్చి కాలనీ ఏర్పాటు చేస్తామని ఆర్డీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్యామ్‌ప్రసాద్, ఎస్‌ఐ సుధాకర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా మహాకుంభాభిషేకం

వరదయ్యపాళెం, అక్టోబరు 15: మండలంలోని కువ్వాకొల్లి పంచాయతీ లక్ష్మీపురం(కె)లో నూతనంగా నిర్మించిన వేంకటేశ్వరాలయ మహాకుంభాభిషేకం శాస్త్రోక్తంగా జరిగింది. ఉదయం గణపతిపూజ అనంతరం లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ శాంతిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు.

పుత్తూరు వార్తలు

కూటమి ప్రభుత్వంతోనే గ్రామీణాభివృద్ధి

- పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ మాధవయ్య


భూమి పూజలో మాధవయ్య తదితరులు

పుత్తూరు అర్బన్, అక్టోబరు 15: కూటమి ప్రభుత్వంలో గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టనుందని పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య అన్నారు. మంగళవారం తడుకు పంచాయతీలో పల్లె పండుగ కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గంజి మాధవయ్య విచ్చేశారు. ముందుగా అరటి మొక్కను నాటి కార్యక్రమానికి ప్రారంభించారు. అనంతరం పంచాయతీ పరిధిలోని వేణుగోపాలపురంలో రూ.4.50 లక్షలతో సిమెంటు రోడ్డు, మురుగునీటి కాలువ పనులకు భూమి పూజ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ప్రాథమిక వసతులు కల్పించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంకల్పిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తడుకు సర్పంచు పాశం వెంకటేష్, టీడీపీ రూరల్ ప్రధాన కార్యదర్శి బాలాజి, కరుణాకర్ యాదవ్, ఆదిమందడి, కోట గజపతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అంజేరమ్మ, ఉపాధి ఏపీవో భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు వడమాలపేట విద్యార్థులు



వడమాలపేట, అక్టోబరు 15 (ఆంధ్ర జ్యోతి): అండర్ 17 జూడో ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టు ఎంపిక పోటీల్లో వడమాలపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. శ్రీనివాస క్రీడా సముదాయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 17 ఏళ్లలోపు బాల బాలికల జూడో జిల్లా జట్టు ఎంపికల్లో టెన్త్ విద్యార్థి భానుప్రకాష్ (50 కిలోలు), టెన్త్ విద్యార్థిని మానస(62 కిలోలు) విభాగాల్లో ఎంపికయ్యారు. వీరు ఈ నెల 20, 21 తేదీల్లో శ్రీకాళహస్తిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు చెప్పారు.

సందేహాలను నివృత్తి చేసుకోండి

వడమాలపేట, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): ఈ క్రాప్ ముసాయిదాలో సందేహాలు, తప్పులుంటే రైతులు నివృత్తి చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ప్రసాద్ రావు కోరారు. మండలంలోని పత్తి పుత్తూరులో మంగళవారం జరిగిన ఈ క్రాప్ సామాజిక తనిఖీ గ్రామసభలో ఆయన మాట్లాడుతూ 2024 ఖరీఫ్ సీజన్ లో ఈ క్రాప్ నమోదు ముసాయిదా జాబితాలు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉందన్నారు. ఈ నెల 18 లోగా తప్పులను సరిచేసుకోవాలన్నారు. మండలం లలో 2227 మంది రైతులకు 6177 ఎకరాల్లో ఈ క్రాప్ పూర్తి చేశామన్నారు. ఏవో విజయ్‌కుమార్, సహాయకులు దివ్య, యమున పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ చూపండి

వడమాలపేట, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో పంచాయతీలకు నిధులు సమకూరాయని గ్రామాల్లో పారిశుధ్యంపై శ్రద్ధ చూపాలని డీఆర్పీ కిషోర్ చెప్పారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులు మంజూరయ్యాయన్నారు. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి విపత్తులు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో శేషగిరిరావు, వైద్యాధికారి చక్రపాణి, సీహెచ్‌వో పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముసురు వాన

పుత్తూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తుఫాను ప్రభావంతో పుత్తూరు మండలంలో మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులు పడుతున్నాయి. ముసురు వర్షంతో రోజువారీ పనులకు ఆటంకం కలిగింది. ఈనెల సాధారణ వర్షపాతం 71.4 మిల్లీమీటర్లు కాగా ఇప్పటి వరకు 41 మి.మీ వర్షం మాత్రమే పడింది. మండలంలో మొత్తం 34 చిన్న, మధ్య తరహా చెరువులు వున్నా ఎస్‌బీఆర్‌పురం, గోవిందపాళెం రెండు చెరువులలో మాత్రమే కొద్దిపాటి నీరు ఉన్నాయని జలవనరుల శాఖ ఏఈ పరుశురామ్‌నాయక్ తెలిపారు. ఈదురు గాలులు లేనందున విద్యుత్ స్తంభాలు, తీగలు తెగిపోలేదని ట్రాన్స్‌కో ఏడీఈ శంకరయ్య తెలిపారు. అయినా స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, సిబ్బందితో అప్రమత్తంగా ఉన్నామన్నారు.

శ్రీకాళహస్తి సత్యవేడు

మోస్తరు వర్షం... తగ్గిన జన సంచారం





శ్రీకాళహస్తిలో కురుస్తున్న వర్షం - వర్షానికి చిత్తడిగా మారిన సత్యవేడులోని నాగాలమ్మ గుడివీధి - బీఎన్‌కండ్రిగ గాజులపెళ్ళూరు చెరువు కట్టకు వేస్తున్న ఇసుక బస్తాలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో శ్రీకాళహస్తిలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు అడపాదడపా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. మంగళవారం పాఠశాలల తరగతులు యధావిధిగా జరిగాయి. రోజంతా వాతావరణం ముసురుగా ఉండటంతో పట్టణంలో రోడ్లపై జనసంచారం తగ్గింది. సాయంత్రం 4 నుంచి రాత్రి వరకు తేలికపాటి జల్లులు విరామం లేకుండా కొనసాగింది. లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. వీధుల్లో నీరు నిలవకుండా కాలువలను ఎప్పటికప్పుడు అధికారులు శుభ్రం చేయించారు.

అప్రమత్తంగా ఉండండి

బుచ్చినాయుడుకండ్రిగ: వర్షాలకు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా మండల స్థాయి అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. తహసీల్దార్ సుబ్రమణ్యం ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఎస్‌ఐ విశ్వనాథ నాయుడు వివిధ శాఖధికారులు గ్రామాల్లో పర్యటించారు. గాజులపెళ్లూరు చెరువు కట్టకు గండి పడే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తుగా ఇసుక బస్తాలు వేసి పటిష్ఠ పరిచారు. వర్షం కారణంగా ఇప్పటి వరకు ఎటువంటి నష్టం వాటిల్ల లేదు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు 50మిలీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

సత్యవేడు: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో మండలంలో మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు కురిసిన వర్షంతో పట్టణంలో ప్రధాన వీధులన్నీ చిత్తడిగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు శ్రీసిటీ పరిసరాల్లో ఉదయం నుంచి వర్షం ఎడతెరపి లేకుండా కురవడంతో పరిశ్రమలకు వెళ్లే కార్మికులు నానా అవస్థలు పడ్డారు.

పొలాలకు వెళ్లొద్దు

ఏర్పేడు: తుఫాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు భార్గవి ప్రజలకు సూచించారు. పొలాలకు వెళ్లే రైతులు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల వద్దకు వెళ్లవద్దన్నారు. 17వ తేదీ వరకు రెవన్యూ, పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు ఏ అవసరం వచ్చినా స్థానిక వీఆర్వోలు, పంచాయతీ సిబ్బందికి, పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.



శాస్త్రోక్తంగా ప్రదోష పూజలు

నాగలాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయంలో మంగళవారం ప్రదోష పూజలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలోని పరివార దేవతలకు ఆలయ ప్రధాన అర్చకుడు కార్తికేశన్ గురుకుల్ అభిషేకాలు చేసి విశేష పూజలు జరిపారు. సాయంత్రం ఆలయ ప్రదోష మండపంలోని నందీశ్వరుడికి పంచామృతంతో అభిషేకించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం వివిధ పుష్పాలతో అలంకరించి నక్షత్ర, కుంభ, మహా హారతులు పట్టారు. భక్తుల శివనామస్మరణలతో ఆలయం మార్మోగింది. తదనంతరం ఉత్సవ మూర్తులైన వాల్మీకేశ్వర స్వామి, మరగదాంబిక అమ్మవార్లను సుందరంగా ముస్తాబు చేసి ఆలయ ఆవరణలో ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత నేతృత్వంలో సిబ్బంది పర్యవేక్షించారు.

చినుకు పడితే చిత్తడే!


చిన్నపాటి వర్షానికి రొచ్చురొచ్చుగా మారిన బీసీకాలనీ రోడ్డు

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం పెద్దకన్నలి పంచాయతీలోని బీసీకాలనీ సమస్యల నిలంగా మారింది. గతంలో బీసీ కాలనీకి రోడ్డు మంజూరైంది. అప్పటి కాంట్రాక్టరు సుమారు కిలోమీటరు దూరం ఉన్న సిమెంటు రోడ్డును అటువైపు, ఇటువైపు వేసి మధ్యలో సగభాగం వదిలేశాడు. సబ్‌స్టేషన్ ఈ పంచాయతీలోనే ఉంది. దీంతో నిత్యం భారీ వాహనాలు వస్తూపోతుంటాయి. రైతులు పొలం పనులకు కూడా ఇదే మార్గంలో వెళ్లాల్సి ఉంది. ఈ రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారడంతో వాహనదారులు గ్రామానికి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. పెద్దకన్నలి పంచాయతీలోని ఎస్టీకాలనీ, బీసీకాలనీ, హరిజనవాడ, గ్రామంలో మురుగుకాలువలు పూర్తిగా లేవు. తాగునీటి ట్యాంకులను కూడా శుభ్రం చేయడంలేదు. కొన్ని వీధిదీపాలు వెలగడం లేదని గ్రామస్తులు చెబుతున్నారు. పల్లెపండుగ వారోత్సవాల్లో గ్రామంలోని సమస్యలను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజలో ఎమ్మెల్యే ఆదిమూలం తదితరులు

నారాయణవనం, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): పండుగ వాతావరణాన్ని తలపించేలా పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఆదిమూలం తెలిపారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా నారాయణవనంలోని కళింమిట్ట గ్రామానికి సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. రూ.8 లక్షలతో 200 మీటర్లు దూరం వరకు రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. భీముని చెరవు, డీకే పాలెం, ఇప్పతాంగాళ్ గ్రామాల్లో సిమెంటు రోడ్ల నిర్మాణానికి భూమి పూజలు చేశారు. జడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, పీఆర్ డీఈ ఉమాశంకర్, ఎంపీడీవో గుణశేఖర్, తహసీల్దార్ జయరాములు, ఈవోపీఆర్డీ వేనయ్య, ఉపాధి ఏపీవో సుకన్య, వెలుగు ఏపీఎం మమత, నారాయణవనం పంచాయతీ ఈవో కేపి షణ్ముగం, టీడీపీ నాయకులు గోవిందస్వామి, ఊరప్ప, గోవిందశెట్టి తదితరులు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం


శిరుణంబూదూరులో భూమిపూజ నిర్వహిస్తున్న నాయకులు


సత్యవేడు, అక్టోబరు 15: పల్లెల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సత్యవేడు టీడీపీ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని మదనం బేడు, శిరుణం బూదూరు, కాదిరివేడు పంచాయతీల్లో పల్లె పండుగ వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా నెరవేరుస్తుందన్నారు. జగన్ ప్రభుత్వంలో ఐదేళ్లుగా అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు పరమశివం, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అమాసరెడ్డి, నాయకులు షణ్ముగం, శశిమోహన్, సురేందర్ రెడ్డి, ఆనందయ్య రవి, సంపత్ కుమార్, కాటయ్య, కన్నుదురై, సీమాన్, బక్కయ్య, సెక్రటరీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శిక్షణ తరగతులు ప్రారంభం

రేణిగుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీల్లో పరిపాలన విధానంపై రెండురోజుల శిక్షణ తరగతులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రారంభమయ్యాయి. ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు ఎంపీడీవో విష్ణుచిరంజీవి, ఈవోపీఆర్డీ ప్రభురావు ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. పంచాయతీల ఆర్థిక బలోపేతం, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, లైటింగ్ విషయాల్లో అవగాహన కల్పించారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని 28 పంచాయతీలకు సంబంధించిన ఉప సర్పంచులు, వార్డు సభ్యులకు శిక్షణ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు మాట్లాడుతూ... పంచాయతీల్లో పనులు కేటాయింపులలో సమష్టిగా నిర్ణయం తీసుకోవాలన్నారు ఈవోపిఆర్డీ రాజశేఖర్, రిసోర్సు పర్సన్ పాల్గొన్నారు.

సిమెంటు రోడ్లపై నిలిచిన వర్షపు నీరు



పిచ్చాటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సిమెంటు రోడ్ల పక్కన మురుగు నీటి కాలువలు నిర్మించక పోవడంతో ప్రస్తుతం మోకాటి లోతు నీళ్లు నిలిచాయి. మండలంలోని వెంగళత్తూరు దళితవాడ వీధుల్లో సిమెంటు రోడ్డుపై నిలిచిన నీటిని బయటికి తరలించాలని స్థానికులు కోరుతున్నారు. ఇళ్ల ముందు నిలిచిన నీటితో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాల్సి ఉంది.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి


కలాంకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాపుగున్నేరి సమీపంలో శ్రీకాళహస్తీశ్వర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్ కళాశాలలో మంగళశారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 93వ జయంతిని ప్రపంచ విద్యార్థుల దినోత్సంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మిద్దెల హరి మాట్లాడుతూ భారత మాజీ రాష్ట్రపతి, మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా, భారతరత్న కలాం విద్యార్థుల సాధికారతను పెంచేందుకు ఎంతో కృషి చేశారన్నారు. తనచివరి దశలో షిల్లాంగ్‌లో బోధిస్తూ మరణించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, డైరెక్టర్ శ్రీకుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు నిల్వలేకుండా చర్యలు

ఏర్పేడు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎండీపుత్తూరులో సర్పంచు మోహనప్రియ, పంచాయతీ కార్యదర్శి చంద్రకళ, సిబ్బంది, టీడీపీ నాయకులు కలిసి సమస్యలు తెలుసుకునేందుకు గ్రామంలో పర్యటించారు. వీధుల్లో నీరు నిల్వ ఉండటంతో వెంటనే పారిశుధ్య కార్మికుల చేత దారి తీయించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ... తుఫాన్ కారణంగా ఎవరికి ఇబ్బంది కలిగిన వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు. టీడీపీ నాయకులు వీరరాఘువవు, కేశవులుయాదవ్, సుబ్రహ్మణ్యంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

19 అడుగులకు చేరిన అరణియార్

పిచ్చాటూరు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పిచ్చాటూరు అరణియార్ నీటమట్టం మంగళవారం సాయంత్రానికి 19 అడుగులకు చేరినట్లు ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు. వర్షానికి ముందు వరకు ఈ ప్రాజెక్టులో 18అడుగుల వరకు నీరు ఉండేది. తుఫాను కారణంగా గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో ప్రాజెక్టు నీటి మట్టం అడుగు పెరిగింది. సాయంత్రం 6 గంటలకు ప్రాజెక్టుకు 160 క్యూసెక్కుల నీరు వస్తున్నట్లు ఏఈ వివరించారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 31 అడుగులు(1.85 టీఎంసీలు)గా ఉంది. భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రాజెక్టుపై గట్టి నిఘా ఉంచారు. ఏఈ స్థాయి అధికారి 24 గంటలు ప్రాజెక్టు గేట్ల వద్దే ఉండి పర్యవేక్షించే విధంగా ఉన్నతాధికారులు, ప్రజలు చేపట్టారు.

ఐదు నెలలుగా కనపడని 108 వాహనం

కేవీబీపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కేవీబీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి 108 వాహనాన్ని కేటాయించారు. అయితే వాహనం మరమ్మతులకు గురికావడంతో ఐదునెలలుగా వాహనం లేక మండల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర పరిస్థితిలో 108 అంబులెన్స్‌కు ఫోన్ చేస్తే పక్క మండలాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పాటు అంబులెన్స్ సిబ్బందికి జీతాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించాల్సి ఉంది.

చెక్‌బౌన్స్ కేసులో విద్యాసంస్థల ఛైర్మన్‌కు ఏడాది జైలు

రేణిగుంట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) చెక్ బౌన్స్ కేసులో రేణిగుంటలోని యోగానంద విద్యాసంస్థల ఛైర్మన్ డి.మోహన్‌రెడ్డికి ఏడాది జైలుశిక్షతో పాటు తీసుకున్న రూ.14లక్షలు చెల్లించాలంటూ తిరుపతి మొదటి ఏడీఎం కోర్టు జడ్జి సత్యకాంత్ తీర్పు వెల్లడించారు. రెడ్డివారి వెంకటసుబ్బారెడ్డి వద్ద 2018 నవంబరు 16న మోహన్‌రెడ్డి డబ్బు తీసుకుని చెక్కు ఇచ్చారు. అయితే ఆ చెక్కు బౌన్స్ కావడంతో వెంకటసుబ్బారెడ్డి కోర్టును ఆశ్రయించాడు. దీంతో మంగళవారం కోర్టు ఈ తీర్పు ఇచ్చింది.

నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన

నారాయణవనం, అక్టోబర్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎంపీపీ ఎస్ మెయిన్ స్కూల్ ఆవరణలో ఉన్న భవిత సెంటర్ విద్యార్థులకు నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఎంఈవో ప్రభాకర్ రాజు మాట్లాడుతూ అభ్యసనలో 5 రకాల లోపాలను ప్రత్యేక శిక్షణ ద్వారా సరిదిద్దవచ్చని తెలిపారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రోటరీక్లబ్‌లో మంగళవారం అధ్యక్షురాలు శైలజ, కార్యదర్శి సిద్దులగారి ప్రసాద్ ఆధ్వర్యంలో రోటరీ జిల్లా గవర్నర్ సతీష్ మాధవన్ ఆధ్వర్యంలో సెప్టెంబరులో జరిగిన పోటీల్లో విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు. అదే విధంగా ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు, జాతీయ అవార్డు గ్రహీత కూనాటి సురేష్‌కు రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డును అందజేశారు.

పాఠశాలల పక్కన పొగాకు ఉత్పత్తుల విక్రయాలొద్దు


దుకాణదారుకు కరపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీకాళహస్తి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పాఠశాలల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు చేయవద్దని దుకాణ నిర్వాహకులకు ఉపాధ్యాయులు సూచించారు. పాఠశాలలకు 200 మీటర్ల పరిధిలో పాన్‌పరాగ్, గుట్కాలు, పొగాకు సంబంధిత వస్తువుల విక్రయాలపై ప్రభుత్వం నిషేధం విధించింది. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పాఠశాలల సమీపంలోని దుకాణ నిర్వాహకులకు కరపత్రాలు అందజేశారు.

తవ్వారు... వదిలేశారు!



వరదయ్యపాళెం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలం లోని గోవర్ధనపురం వంతెన సమీపంలో తడ - శ్రీకాళహస్తి ప్రధాన రహదారి పక్కనే గ్యాస్ పైప్‌లైను కోసం కొద్ది రోజుల క్రితం గుంతలను తవ్వారు. అయితే వాటిని ఇంత వరకు పూడ్చలేదు. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఈ మార్గంలో ప్రజలు, వాహనదారులకు, పరిశ్రమలకు వెళ్లే వాహనదాలకు కష్టతరంగా మారింది. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రేపు దుకాణాల బహిరంగ వేలం

నాగలాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సురుటుపల్లె పల్లికొండేశ్వరాలయ ఆవరణలోని పలు దుకాణాలకు సంబంధించి ఈనెల 17వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో లత పేర్కొన్నారు. ఆలయ ఆవరణలోని కూల్‌డ్రింక్స్ షాపుకి సంబంధించి 2024 నవంబరు 5నుంచి 2025 నవంబరు 4వ తేదీ వరకు, అలాగే ఇత్తడి పూజ సామాన్లు, స్వామివారి వస్త్రాల విక్రయాలను 2024 డిసెంబరు 1 నుంచి 2025 నవంబరు 30 వరకు, అలాగే భక్తుల పాదరక్షలు భద్రపరిచి రుసుము వసూలు చేసుకోవడానికి 2024 అక్టోబరు 5 నుంచి 2025 అక్టోబరు 4 వరకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ఆలయ కార్యాలయంలో రూ.10 వేలను ధరావతుగా చెల్లించాల్సి ఉంటుంది.